


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు

సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర

# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA

RNI No: TELTEL/2024/86684



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 07.08.2025 | సంపుటి : 2 | సంచిక :185 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Thursday | 07.08.2025 | volume : 2 | Issue : 185 | Pages : 8 | Cost : 2/- |


## అమ్మతనాన్ని అమ్ముకున్న

# నమ్రత

**ఫర్టిలిటీ సెంటర్లపై నమ్మకం కోల్పోయేలా చేసిన సృష్టి**

**సృష్టి ఫెర్టిలిటీ కేసులో 17 మంది అరెస్టు**




**హైదరాబాద్, ఆగస్ట్ 6 :**

అమ్మతనాన్ని కూడా అమ్ముకోవడమెలాగో సృష్టి ఫర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత చూపించా రు. ఇందులో బయటపడ్డ నిజాలు ఇప్పుడు విపరీత ధోరణలును బయటపెట్టాయి. ఇలాంటి సెంటర్లు ఎన్ని ఉన్నాయో వాటి కార్య కలాపాలపైనా దృష్టి సారించాలి. సరోగసీ పేరుతో ఇతరల పిల్లలను అప్పగించి లక్షల్లో దండుకోవడమనే వ్యాపారంలో నమ్రత బాగా ఆర్జించారు. కొన్నేళ్ల క్రితమే మోసాలు బయటపడి నమ్రత లైసెన్స్ రద్దు కావడంతో ఆమె ఇతర వైద్యులను బినామీగా పెట్టుకుని వారి పేరిట లైసెన్స్ తీసుకుని హైదరాబా ద్, విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, కర్ణాటక, ఒడిసా, కోల్‌కతా తదితర ప్రాంతాల్లో సృష్టి ఫర్టిలిటీ-సెంటర్ శాఖలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఎంతో మంది దంపతు లను సరగసీకి ఒప్పించిన డాక్టర్ నమ్రత.. ఒక్కో జంట నుంచి రూ.30 నుంచి రూ.50 లక్షల వరకు దోచుకున్నట్లు పోలీసులు గుర్తించారని తెలిసింది. అనేక కోణాల్లో విచారించిన పోలీసులు ఆమె స్టేట్‌మెంట్ రికార్డు చేశారు.

మిగతా 4 లో



## బీసీ రిజర్వేషన్లపై

# మీకు కక్ష ఎందుకు?

## తెలంగాణపై గుజరాతీల పెత్తనం ఏంటి?

- 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటే గద్దె దించాలా?
- మోదీపై నేరుగా విమర్శలు గుప్పించిన సీఎం రేవంత్‌రెడ్డి
- ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో ఉద్వేగపూరిత ప్రసంగం
- బీజేపీ, బీఆర్ఎస్ తీరును తూర్పార పట్టిన రేవంత్ రెడ్డి

బీసీ రిజర్వేషన్ బిల్లులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపకపోతే... ప్రధాని మోదీని గద్దె దించి, రాహుల్ గాంధీని ప్రధానిగా చేసి బీసీ రిజర్వేషన్లు సాధించుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ప్రధాని మోదీ మెడలు వంచేందుకే ఢిల్లీలో మహాధర్నా చేపట్టామని, బీసీ బిల్లులకు ఆమోదం లభించకపోతే మోదీని గద్దె దింపుతామని అన్నారు. బీజేపీ మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ చెప్పినా మోదీ ప్రధానిపదవి వదలడం లేదని... 75 ఏళ్ల నిబంధన ఆయనకు వర్తించదా? అని ప్రశ్నించారు. మోదీ గద్దె దిగినా, దిగకపోయినా 2029లో మేమే ఆయనను గద్దె దించి, రాహుల్ గాంధీని ప్రధానిగా చేస్తామన్నారు. ఇదే మా శపథమని ఘాటుగా వ్యాఖ్యానించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని 150 సీట్లకే పరిమితం చేస్తామని సవాల్ విసిరారు.

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 6 :**

తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ టీపీసీసీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రిజర్వేషన్లు 42 శాతం ఇవ్వాలని రెండు బిల్లులను అసెంబ్లీలో ఆమోదించామని, ఆనాటి సీఎం కేసీఆర్ బీసీలపై కక్షతీర్చుకుంటూ తెలంగాణలో 50 శాతం మించకుండా చట్టం చేశారని విమర్శించారు. బలహీన వర్గాలకు అన్యాయం చేసే ఆ చట్టాన్ని తొలగించేందుకు ఆర్డినెన్స్ తీసుకొచ్చామని చెప్పారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును చట్టం చేసి గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపించామని తెలిపారు. 50 శాతం క్యాప్‌ను తొలగించే ఆర్డినెన్స్ కూడా రాష్ట్రపతి వద్ద ఉంది. నాలుగు నెలలు గడిచినా ఆమోదం రాలేదని చెప్పారు. సీలకు అన్యాయం జరుగుతుంటే గల్లీ నుంచి ఢిల్లీకి వచ్చి ధర్నా చేస్తున్నాం.

మిగతా 2 లో



06

## నేను మోదీకి ఫోన్ చేస్తాను

ట్రంప్‌కు బ్రెజిల్ అధ్యక్షుడి సమాధానం



06

చైనా పర్యటనకు

## ప్రధాని మోదీ షెడ్యూల్ ఖరారు..

'గల్వాన్' ఘటన తర్వాత తొలిసారి



06

## భారత్ ఎవరికీ తలవంచదు..

ట్రంప్ టారిఫ్‌లపై హర్ష్ గోయెంకా



పార్టీ ఆదేశాల మేరకు

## పని చేశా

- ఫామ్ హౌస్‌లో వంద కోట్లకు అమ్ముడుపోలే
- ప్రజలను మరచి విన్యాసాలు చేస్తున్న పార్టీలు
- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సంచలన వ్యాఖ్యలు

03

# గాంధీ కుటుంబాన్ని పొగడడానికే బిసి ధర్నా

- సోనియా, రాహుల్ జపంలో తరించిన రేవంత్
- జంతర్‌మంతర్ ధర్నాపై కిషన్ రెడ్డి ఎద్దేవా

జంతర్‌మంతర్‌లో కాంగ్రెస్ పార్టీ పెట్టుకున్న సభ.. గాంధీ కుటుంబాన్ని పొగడటానికే సరిపోయిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రాజకీయంగా ఎదురవుతున్న ఒత్తిడిని తట్టుకునేందుకు.. గాంధీ కుటుంబం అనుగ్రహం పొందాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ సభ పెట్టుకున్నారని ఆరోపించారు. ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న బీసీ ధర్నాపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి 31 నిమిషాల ప్రసంగంలో.. 50 శాతం కంటే ఎక్కువ సమయం రాహుల్, సోనియా జపం చేయడానికే సరిపోయిందని కిషన్ రెడ్డి విమర్శించారు. బీసీ రిజర్వేషన్లు ఇస్తామని తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారు.. దాన్ని పూర్తిచేసుకోవాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ దే అని ఆయన ఉద్ఘాటించారు.



03



## భారత్‌ను దూరం చేసుకోవద్దు

ట్రంప్ సుంకాల పెంపు వ్యాఖ్యలపై నిక్కీ హేలీ ఆసక్తికర వ్యాఖ్యలు

06

## కాంగ్రెస్ ఢిల్లీ ధర్నా

# అట్టర్ ఫ్లాప్

- రాహుల్, ఖర్గేలు డుమ్మా కొట్టడమే నిదర్శనం
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

బీసీలకు 42శాతం కోటా పేరిట సీఎం రేవంత్ రెడ్డి అండ్ బ్యాచ్ ఢిల్లీ వెళ్లిన చేసిన డ్రామా అట్టర్ ఫ్లాప్ అయ్యిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఢిల్లీ వేదికగా నిర్వహించిన దొంగ దీక్షకు.. కూతవేటు దూరంలో ఉండి రాహుల్ గాంధీ రాలేదని.. మాకు బీసీల కన్నా బిహారే ముఖ్యమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాలేదని తెలిపారు.



02

# భారత్‌పై ట్రంప్ సుంకాల మోత

## మరో 25 శాతం వడ్డన

## ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై అధ్యక్షుడి సంతకం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు జరుపుతున్న భారత్‌పై మరో 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే భారత్‌పై 25 శాతం ప్రతీకార సుంకం విధించారు. దీంతో భారత్ నుంచి దిగుమతయ్యే ఉత్పత్తులపై 50 శాతం సుంకం వర్తించనుంది. ఈ మేరకు బుధవారం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకం చేశారు. రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో అక్కసు వెళ్లగక్కుతున్న ట్రంప్.. 24 గంటల్లో భారత్‌పై భారీ టారిఫ్ వేస్తానని మంగళవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా అన్నంత పనీ చేశారు. రష్యా నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా చమురు కొనుగోళ్లు జరుపుతున్నందునే ఈ టారిఫ్ విధిస్తున్నట్లు- ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో ట్రంప్ స్పష్టంగా పేర్కొన్నారు.

06



# కర్తవ్య భవన్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

దేశ రాజధాని దిల్లీలో ఉమ్మడి కేంద్ర సచివాలయ( సీసీఎస్) ప్రాజెక్టు కింద నిర్మించిన మొదటి భవనమైన 'కర్తవ్య భవన్'ను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు కింద మొత్తం 10 కార్యాలయ భవనా లు నిర్మించనున్నట్లు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ తెలిపింది. సీసీఎస్-3గా పరిగణిస్తున్న కర్తవ్య భవన్ లోకి కేంద్ర హోం, విదేశీ వ్యవహారాలు, పెట్రోలియం శాఖ, ప్రధాన మంత్రికి ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ కార్యాలయాలు తరలించనున్నట్లు పేర్కొంది.




02



## కర్తవ్యభవన్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

**ఢిల్లీ, ఆగస్టు 6 :** దేశ రాజధాని ఢిల్లీలో ఉమ్మడి కేంద్ర సచివాలయ ప్రాజెక్టు కింద మొత్తం 10 కార్యాలయ భవనాల నిర్మాణాన్ని 22 నెలల్లో పూర్తిచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని ప్రకటించింది. వాటిలో మొదటిదైన కర్తవ్య భవన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ మీడియాకు ఈ విషయాన్ని వెల్లడించారు. సీసీఎస్-3గా పరిగణిస్తున్న కర్తవ్య భవన్‌లోకి కేంద్ర హెూంశాఖ, విదేశీ వ్యవహారాల శాఖ, పెట్రోలియం శాఖలతోపాటు ప్రధానమంత్రికి ముఖ్య శాస్త్ర వ్యవహారాల సలహాదారు కార్యాలయాలు తరలివెళ్లనున్నాయి. 2019లో ప్రారంభించిన సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో సిద్ధమైన మొదటి భవనమిదే. ప్రస్తుతం శాస్త్రి భవన్, కృషి భవన్, నిర్మాణ్ భవన్, ఉద్యోగ్ భవన్‌లలో ఉన్న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు సీసీఎస్ ప్రాజెక్టు కింద నిర్మితమయ్యే నూతన భవనాల్లోకి క్రమంగా మారిపోతాయి. అన్ని కార్యాలయాలు కొత్త భవనాల్లోకి మారిన తర్వాత పాత భవనాల కూల్చివేతకు టెండర్లు పిలువనున్నట్లు సమాచారం.

## రిజర్వేషన్లపై అవగాహన లేని బిజెపి

- రిజర్వేషన్ల ధర్నాతో బిజెపి కళ్లు తెరవాలి
- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 6 :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం జంతర్ మంతర్ చలో ఢిల్లీ గ్రాండ్ సక్సెస్ అయ్యిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణఅన్నారు. ఈ ధర్నాతో బిజెపి కళ్లు తెరవాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం తమ పోరాటం ఆగబోదన్నారు. ఈ మహాధర్నాకు 50 మంది కాంగ్రెస్ ఎంపీలు మద్దతిచ్చారని చెప్పారు. బీజేపీకి రిజర్వేషన్లు అంశంలో క్లారిటీ లేదన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో ముస్లిం రిజర్వేషన్లు ఇస్తూ.. తెలంగాణలో అడ్డుకుంటాం అంటున్నారని ఫైర్ అయ్యారు. రిజర్వేషన్ల కోసం తమపోరాటం కొనసాగుతూనే ఉంటుందన్నారు. తెలంగాణ బీజేపీ నేతలకు రిజర్వేషన్లపై క్లారిటీ లేదన్నారు. బీసీలకు రిజర్వేషన్ ఇస్తే అడ్డుకుంటామని బీజేపీ నేతలు మాట్లాడుతున్నారు. బీజేపీ తెలంగాణ నేతలు పార్టీ సమావేశాలు పెట్టుకుని రిజర్వేషన్ అంశాల్లో క్లారిటీ- తీసుకోవాలని సూచించారు. ప్రజలకు బీసీలకు ఏ విధంగా న్యాయం చేయాలో బీజేపీ నాయకులు ఆలోచన చేయాలన్నారు. బీసీలకు న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను కేంద్రం ఆమోదించాలనే డిమాండ్ తో సీఎం రేవంత్ ÷డ్డి నేతృత్వంలో ఆగస్టు 6న జంతర్‌మంతర్ దగ్గర మహా ధర్నా జరుగుతోంది. ఇప్పటికే డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ హేశ్ కుమార్ గౌడ్ తో పాటు- మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీలోని బీసీ నేతలు, బీసీ సంఘాల నాయకులంతా హాజరయ్యారు.

## బిసి రిజర్వేషన్ పేర డ్రామా

### భాజపా ఎంపీ డీకే అరుణ విమర్శలు



**హైదరాబాద్, ఆగస్ట్ 6 :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని భాజపా ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక భాజపాను నిందిస్తోందంటూ మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని.. అందుకే బీసీ రిజర్వేషన్ల పేరుతో మరోసారి డ్రామాలు చేస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే భాజపాపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదని భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. రాష్ట్ర భాజపా కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో బిల్లు పెట్టి.. దిల్లీలో ధర్నా చేస్తారని తాము అసెంబ్లీలోనే చెప్పామని వ్యాఖ్యానించారు. ముస్లిం రిజర్వేషన్ల విషయంలో ఇప్పటికీ కాంగ్రెస్ స్పష్టత ఇవ్వట్లేదు. తెలంగాణ వచ్చినప్పుడు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండేవి.. ఇప్పుడు ముస్లింలకు 10శాతం ఇస్తే బీసీలకు వచ్చేది 32 శాతమే.. అంటే గతం కంటే 2 శాతం తక్కువ. తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్లను ఎక్కడ అమలు చేస్తున్నారో రాహుల్ గాంధీ చెప్పాలి. రిజర్వేషన్లను ముస్లింలకు కట్టబెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది అని ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు.

## సంక్షేమ పథకాలపై సుప్రీంకోర్టు కీలకతీర్పు

**న్యూఢిల్లీ, ఆగస్టు 6 :** సంక్షేమ పథకాల్లో సీఎం ఫొటోను వినియోగించే విషయంలో సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పును వెలువరించింది. ఇదే అంశంపై మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు తోసిపుచ్చుతూ తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి భారీ ఊరట కల్పించింది. జులై 31న ఇచ్చిన తన ఉత్తర్వులో సంక్షేమ పథకాల్లో ప్రస్తుత, మాజీ ముఖ్యమంత్రుల ఫొటోలను ఉపయోగించకూడదని డీఎంకే ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ అయిన ఏఐఏడీఎంకే నాయకుడు సీవీ షణ్ముగంకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్ వీ అంజరియాలతో కూడిన ధర్మాసనం రూ.10 లక్షల జరిమానా విధించింది. తమిళనాడు సంక్షేమ పథకాలలో ముఖ్యమంత్రి పేరును ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్ సరికాదని, చట్టపరమైన ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని సుప్రీంకోర్టు పేర్కొంది. రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం సంక్షేమ పథకాల్లో సీఎం ఫొటోలను వినియోగించకుండా ఉత్తర్వులు ఇవ్వాలంటూ మద్రాస్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన కోర్టు.. కొత్తగా తీసుకురానున్న సంక్షేమ పథకాల్లో ప్రస్తుతం జీవించి ఉన్న నాయకుల పేర్లు వాడొద్దని.. పథకాలపై ప్రచారం చేసుకునే సమయంలో మాజీ సీఎంల ఫొటోలు, పార్టీ జెండాలను ఉపయోగించకుండా నిషేధం విధించింది. దీన్ని సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారించిన సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఎన్నో రాష్ట్రాల్లో నాయకుల పేర్లతో పథకాలు ప్రవేశపెట్టారని.. దీనిపై ఎలాంటి న్యాయ పరమైన నిషేదాజ్ఞలు లేవని ధర్మాసనం ఎదుట తమిళనాడు ప్రభుత్వం తెలిపింది. పిల్ దాఖలు చేసిన పిటిషనర్‌పై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. పలు పథకా లకు ప్రధాని, రాష్ట్రపతి, ప్రధాన న్యాయమూర్తుల ఫొటోలు ఉపయోగించుకోవచ్చని సుప్రీం గతంలో అనుమతి ఇచ్చిందని.. దేశవ్యాప్తంగా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారని.. రాజకీయ పోరాటాల కోసం కోర్టులను వేదికలు చేసుకోవద్దంటూ హెచ్చరిస్తూ పిటిషనర్‌కు రూ.10లక్షల జరిమానా విధించింది.

# బీసీ రిజర్వేషన్లపై మీకు కక్ష ఎందుకు?

(మొదటిపేజీ తరువాయి)

"హైదరాబాద్‌లో చేస్తే తెలంగాణలోని పార్టీల మద్దతు మాత్రమే లభిస్తుంది. ఢిల్లీలో చేస్తే దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోంది. ఇండియా కూటమి పార్టీలు, నేతలు కూడా మద్దతు ఇస్తున్నారు. పార్లమెంటులో మోదీ సర్కార్‌తో తెలంగాణ కోసం కొట్లాడతాం," అని అన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జోడో యాత్ర చేసిన రాహుల్ గాంధీ దేశానికి హామీ ఇచ్చారని, అసెంబ్లీ ఎన్నికల్లో కులగణన చేస్తామని హామీ ఇచ్చారని, దాని ప్రకారమే 42 శాతం రిజర్వేషన్ల చట్టం చేశామని తెలిపారు. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. రాహుల్ గాంధీ, సిద్ధరామయ్య కామారెడ్డిలో హామీ ఇచ్చారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏ సీఎం చేయని సాహసం తామే చేశామని అన్నారు. కేబినెట్ మంత్రులు తనకు అండగా నిలిచి 300 మంది సీఎంలు చేయలేని పనిని చేయగలిగే అవకాశం కల్పించారని తెలిపారు. దేశానికే ఆదర్శంగా నిలబడేందుకు అవకాశం లభించిందని అన్నారు. జనగణనలో కులగణన జరగాలని నిర్ణయించామని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల బిల్లులకు కేంద్రం ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. "మోదీ సర్కార్ బిల్లులకు ఆమోదం తెలిపే వరకు పోరాటం కొనసాగిస్తాం. ప్రధాని మోదీ, బీజేపీ నేతలు బీసీ రిజర్వేషన్ బిల్లులను అడ్డుకొని బలహీన వర్గాలకు అన్యాయం చేస్తున్నారు," అని విమర్శించారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు ఇస్తామంటే గుజరాత్ వారికి ఎందుకు కడుపుమంటొచ్చిందని ప్రశ్నించారు. "గల్లీలో ఉండలేక ఢిల్లీలోనే తేల్చుకుందామని 'చలో ఢిల్లీ' చేపట్టాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధిస్తాం," అని ధీమా వ్యక్తం చేశారు. ఈ ధర్నాకు వందమంది ఎంపీలు, ఇండియా కూటమిలోని పార్టీలు మద్దతు తెలిపినట్లు తెలిపారు. బీసీ రిజర్వేషన్ల కోసం 4 కోట్ల మంది ముక్త కంఠంతో విజ్ఞప్తి చేశారని తెలిపారు. "జంతర్‌మంతర్ వేదికగా మోదీ, ఎన్డీయేకు సవాల్ విసురుతున్నాం. మా డిమాండును ఆమోదిస్తారా? లేక మిమ్మల్ని గద్దె దించాలా? మా బిల్లులను తుంగలో తొక్కే అధికారం ఎవరిచ్చారు?" అని ప్రశ్నించారు. "మోదీ మన బద్ధశత్రువు. బలహీన వర్గాలకు న్యాయం చేసే ఆలోచన ఆయనకు లేదు. ఆయన మోచేతి నీళ్లు తాగే కిషన్ రెడ్డి, బండి సంజయ్, రామచంద్రరావులకు ఏమైంది? తెలంగాణలో మీరేమీ ఓట్లు అడగలేదా? ప్రజల అవసరం తీరిపోయిందా?" అని నిలదీశారు.

బీఆర్ఎస్, బీజేపీపై మరోసారి విరుచుకుపడ్డ సీఎం రేవంత్ రెడ్డి

"బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పిస్తే ఆ రెండు పార్టీలు మోకాలడ్డేస్తున్నాయి. బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని అసెంబ్లీలో మేము బిల్లులు ఆమోదిస్తే, వాటిని తుంగలో తొక్కే హక్కు వీరికి ఎవరు ఇచ్చారు?" అని కేంద్రాన్ని ప్రశ్నించారు. "బీసీ పేరుతో కాంగ్రెస్ డ్రామా చేస్తుందని డ్రామా రావు అంటాడు. కానీ డ్రామాలు ఆడేది కల్వకుంట్ల కుటుంబమే అని తెలంగాణ ప్రజలకు తెలుసు," అని కౌంటర్ ఇచ్చారు. "డ్రామా వాళ్ల ఇంట్లో ఉంటే, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే చిత్తశుద్ధి మాత్రం మాకుంది," అన్నారు. "వాళ్ల ఇంట్లోనే పరిస్థితి బాగాలేదు. ఒకరు బీసీలకు మద్దతు అంటారు. ఇంకొకరు మాట్లాడరు. మరొకరు మధ్యరకం అంటారు. అటూ ఇటూ తేలని వాళ్లు నా గురించి మాట్లాడతారా?" అని వ్యాఖ్యానించారు. "వంద ఓట్ల గోతితొవ్వి పాతిపెట్టినా వీరికి బుద్ధి రాదు. బీసీ రిజర్వేషన్ల బిల్లులకు అసెంబ్లీలో మద్దతు తెలిపిన బీఆర్ఎస్... కేంద్రం ఆమోదం తెలపాలని కాంగ్రెస్ చేపట్టిన మహాధర్నాకు ఎందుకు రాలేదు? బీసీల ఓట్లు వీరికి అవసరం లేదా? బలహీన వర్గాల పట్ల ఇదేనా వీరి చిత్తశుద్ధి?" అని నిలదీశారు. "కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎందుకు నిలదీయడం లేదు?" అని ప్రశ్నించారు. ధర్నాలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.



## కులగణనతో దేశానికి తెలంగాణ రోల్ మాడల్

- బిసి కోటా బిల్లును తొక్కిపెట్టిన మోడీ ప్రభుత్వం
- ఢిల్లీ మహాధర్నాలో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 6 :** తెలంగాణలో కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లులు ఆమోదించామని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అన్నారు. కులగణన చేసి దేశానికే తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించి పంపిన బీసీ కోటా బిల్లులను ప్రధాని మోడీ నాలుగు నెలలుగా తొక్కిపెట్టారని విమర్శించారు. బీసీ కోటా బిల్లులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపితే రాహుల్ గాంధీకి క్రెడిట్ వస్తుందని ప్రధాని మోడీ భయమని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో టీ-పీసీసీ చేపట్టిన బీసీ మహాధర్నా చూసైనా కేంద్రంలోని మోడీ సర్కార్ కు కనువిప్పు కలగాలని..మోడీ తల్చుకుంటే సాయంత్రాని కే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు అవుతాయని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ టీ-పీసీసీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర మహాధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ కోటా బిల్లు తేవటం చారిత్రాత్మకమన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకున్న మొనగాడు సీఎం రేవంత్ రెడ్డి అని.. ఆయన చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. బీసీ కోటా బిల్లుతో మోడీ పరేషాన్లో ఉన్నారని అన్నారు. ఇన్నాళ్లు బీసీలకు రిజర్వేషన్లు అడిగితే ఏ లెక్కన అడుగుతున్నారని అన్నారు. ఇప్పుడు కుల గణన చేసి ఆ లెక్కల ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని అడుగుతున్నామన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం తెలంగాణలో కులగణన చేసి అసెంబ్లీలో ఆమోదించామని.. ఇప్పుడు దేశంలోని బీసీలంతా తెలంగాణ వైపు.. రేవంత్ వైపు చూస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ ఎక్కడ మాట్లాడినా.. తెలంగాణ వైపు చూడండి.. రేవంత్ వైపు చూడండి అని చెప్తున్నారని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బీసీ కోటా బిల్లులను నాలుగు మాసాలుగా కేంద్ర ప్రభుత్వం తొక్కిపెట్టిందని ఫైర్ అయ్యారు. మోడీకి బీసీల బాధ తెలియాలనే ఢిల్లీలో మహాధర్నా చేపట్టామని తెలిపారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎప్పుడైనా పనిచేసి గెలిచారా..? ఎప్పుడూ రాముడు, హనుమంతుడు పేరు చెప్పి గెలవాలని చూస్తారని విమర్శించారు. మేము కూడా దేవుళ్లను పూజిస్తాం కానీ దేవుని పేరుతో రాజకీయం చేయం ఓట్లు- అడగమన్నారు. బీజేపీ ముస్లింల పేరు చెప్పి బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవాలని చూస్తోంది. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేకనే ఇలాంటి సొల్లు కబుర్లు చెబుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ బీసీ అని ఓట్లేయించుకున్న బండి సంజయ్.. కిషన్ రెడ్డి మాట వింటు-న్నాడని విమర్శించారు. బీసీలకు మద్దతుగా రెడ్డిలు, బ్రాహ్మణులు, ఎస్సీలు.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చారు. కానీ తెలంగాణ బీజేపీ బీసీ నేతలకు ఎందుకు ముందుకు రావడం లేదని నిలదీశారు. ఢిల్లీలో కాంగ్రెస్ మహాధర్నా చూసైనా కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. మోడీ సర్కార్ బిల్లులకు ఆమోదం తెలిపే వరకు మా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## వేధింపుల కేసులో హెచ్‌డీ రేవణ్ణ పిటిషన్

**బెంగుళూరు, ఆగస్టు 6 :** జేడీయూ ఎంపీ, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవేగౌడ మనవడు ప్రజ్వల్ రేవణ్ణను లైంగిక వేధింపుల కేసు నుంచి బయటపడేసేందుకు అతడి తండ్రి, జేడీయూ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారు. తన కుమారుడిపై నమోదైన లైంగిక వేధింపుల కేసును కొట్టివేయాలంటూ కర్ణాటక హైకోర్టులో పిటిషన్ వేశాడు. పని మనిషిని లైంగికంగా వేధించాడనే ఆరోపణలతో హసన్ జిల్లాలోని హెూలెనరసిపుర పోలీస్‌స్టేషన్‌లో ప్రజ్వల్ రేవణ్ణపై కేసు నమోదైంది. దాంతోపాటు అతడిపై మరో మూడు లైంగిక వేధింపుల కేసులు కూడా నమోదయ్యాయి. వాటిలో ఒక కేసులో ఇటీవల ప్రజాప్రతినిధుల కోర్టు ప్రజ్వల్‌ను దోషిగా తేల్చింది. అతడికి జీవితఖైదు కూడా విధించింది. ఈ నేపథ్యంలో హెూలెనరసిపుర పీఎస్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని హెచ్‌డీ రేవణ్ణ హైకోర్టును ఆశ్రయించారు.

## అదుపుతప్పి నదిలో పడిన కారు

### ముగ్గురు మృతి

**ఢిల్లీ, ఆగస్టు 6 :** హిమాచల్ ప్రదేశ్‌లో ప్రమాదం చోటు చేసుకుంది. సిమ్లాలో ఓ కారు అదుపుతప్పి నదిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిర్గావ్ ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులు కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో డ్రైవర్ కారుపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు అదుపుతప్పి పబ్బర్ నదిలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులోని ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. ఓ వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతులను విశాల్ థాకూర్, అభ్య కందియాన్, హిమాన్షుగా గాయపడిన వ్యక్తిని హర్ష్ చౌహాన్‌గా గుర్తించారు. నది నుంచి మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం సివిల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కాంగ్రెస్ ఢిల్లీ ధర్నా అట్టర్ ఫ్లాప్

- రాహుల్, ఖర్గేలు డుమ్మా కొట్టడమే నిదర్శనం
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్, ఆగస్ట్ 6 :** బీసీలకు 42శాతం కోటా పేరిట సీఎం రేవంత్ రెడ్డి అండ్ బ్యాచ్ ఢిల్లీ వెళ్లిన చేసిన డ్రామా అట్టర్ ఫ్లాప్ అయ్యిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఢిల్లీ వేదికగా నిర్వహించిన దొంగ దీక్షకు.. కూతవేటు దూరంలో ఉండి రాహుల్ గాంధీ రాలేదని.. మాకు బీసీల కన్నా బిహారే ముఖ్యమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాలేదని తెలిపారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన బీసీ ధర్నాపై హరీశ్‌రావు ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. మీ ధర్నాలో నిజాయితీ లేదని, బీసీలకు 42శాతం కోటా అమలు చేస్తారనే మాటలపై నమ్మకం రాహుల్ గాంధీ, ఖర్గే లతో పాటు, తెలంగాణ ప్రజలకు కూడా లేదని సుస్పష్టం అయ్యిందని హరీశ్‌రావు వ్యాఖ్యా నించారు. మేం గుజరాత్ లో అడగలేదు, ఉత్తర్ ప్రదేశ్ లో అడగలేదు, మహారాష్ట్రలో అడగలేదు తెలంగాణలోనే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అడుగుతున్నాం అని రేవంత్ రెడ్డి ప్రసంగిస్తే.. అదే సమయంలో రాహుల్ గాంధీ గారూ.. ఈ పోరాటం తెలంగాణ కోసం మాత్రమే కాదు, యావత్ దేశం కోసం చేస్తున్న పోరాటం అని ట్వీట్ చేస్తరు. ఒకే రోజు, ఒకే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలకు, రాహుల్ గాంధీ చెప్పిన మాటలకే పొంతన లేదని విమర్శించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ మీద కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో రెండు నాల్కల ధోరణి చూస్తేనే అర్థమవుతున్నదని అన్నారు.మీరు ప్రజలను కొన్నిసార్లు మోసం చేయవచ్చు లేదా కొంతమంది ప్రజలను అన్నిసార్లు మోసం చేయవచ్చు. కానీ అందర్నీ అన్ని సమయాల్లో మోసం చేయలేరు ' అని అబ్రహం లింకన్ చెప్పిన నీతి వాక్యాన్ని ఈ సందర్భంగా హరీశ్‌రావు ప్రస్తావించారు. మంత్రి సమక్షంలోనే కాంగ్రెస్ నాయకులు వీధి రౌడీలుగా బెదిరింపులకు పాల్పడుతుంటే అడ్డుకోవాల్సిన పోలీసులు వారితో కలిసి మహిళా ఎమ్మెల్యేపై దౌర్జన్యానికి పాల్పడటం దుర్మార్గమని విమర్శించారు. ఆమెపై అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తాటాకు చప్పుళ్లు, రౌడీ మూకల దాడులకు భారత రాష్ట్ర సమితి భయపడదన్నారు. ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని, ప్రజాక్షేత్రంలో వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని హరీశ్‌రావు తెలిపారు.



## బిసి బిల్లును వెంటనే ఆమోదించాలి

### మహాధర్నాలో డిప్యూటి సిఎం భట్టి డిమాండ్

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 6 :** బీసీ బిల్లుకు రాష్ట్రపతి వెంటనే ఆమోదం తెలపాలని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు జరిగితే.. దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా నిలుస్తుందని తెలిపారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అమలుపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు. బిల్లు ఆమోదం కోసం నినాదాలు చేస్తూ.. జంతర్ మంతర్ వద్ద బైఠాయించారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కులగణన చేయగలరా.. అని ప్రశ్నించిన ప్రతిపక్షాలకు కులగణన చేసి చూపెట్టారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఆదేశాలతో సైంటిఫిక్‌గా సర్వే చేసినట్లు- చెప్పుకొచ్చారు. బిల్లు అమలు అయితే.. 42 శాతం విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ఆమోదం తెలుపాల్సిందే అని డిమాండ్ చేశారు. ఈ బిల్లుతో ఓబీసీల కల నెరవేరాలని ఆకాంక్షిస్తున్నట్లు- భట్టి చెప్పారు. బీసీ రిజర్వేషన్ల కల్పనలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని భట్టి మండిపడ్డారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు జరగకుండా.. బీజేపీ నాయకులు అడ్డుకుంటు-న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ముస్లింల పేరుతో బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటోందని భట్టి విమర్శించారు.

### లంచం తీసుకుంటూ

## ఏసీబీకి పట్టుబడ్డ ఆర్టీఏ



**జగిత్యాల, ఆగస్టు 6 :** తమ విధులను సక్రమంగా నిర్వర్తించటానికి కొందరు అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు పక్కా వల పన్ని ఓ అధికారిని పట్టుకున్నారు. మరికొద్ది రోజుల్లో పదవీ విరమణ చేయబోతున్న ఓ జిల్లా అధికారి లంచం తీసుకుంటూ ఏసీబీక చిక్కారు. జగిత్యాల జిల్లాలో జరిగిన ఘటన వివరాలు.. జిల్లా రవాణాశాఖాధికారి భద్రునాయక్ ఈనెల 31న రిటైర్‌మెంట్ కాబోతున్నారు. అయితే పట్టుకున్న జేసీబీని విడిచిపెట్టేందుకు శశిధర్ అనే వ్యక్తి అధికారిని ఆశ్రయించాడు. ఇద్దరి మధ్య చివరకు రూ. 22 వేలు లంచంగా తీసుకునేందుకు డీటీవో అంగీకారం చేసుకున్నాడు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా బుధవారం జగిత్యాల రవాణాశాఖ కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేశారు. డీటీవో వద్ద లభించిన రూ.22 వేలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

## డీకే శివకుమార్‌ను కలిసిన రాజగోపాల్

**హైదరాబాద్, ఆగస్ట్ 6 :** కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో బస చేసిన డికెతో ఓ ప్రైవేట్ హోటల్లో.. భేటీ అయ్యారు. రాజగోపాల్ రెడ్డి, డీకే శివకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అయితే తాజాగా రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి ఇస్తానంటేనే కాంగ్రెస్‌లోకి వచ్చా అని తెలిపారు. కాంగ్రెస్‌లో తనని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భువనగిరి ఎంపీని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు చెప్పారని కుండబద్దలు కొట్టారు. ప్రజల కోసం మరోసారి పదవీ త్యాగాని-కై-నా రెడీ అని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే గత కొన్నిరోజులుగా.. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై రాజగోపాల్ రెడ్డి అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డీకే శివకుమార్, రాజగోపాల్ రెడ్డిల భేటీ- ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే గురువారం డీకే శివకుమార్, సీఎం రేవంత్ రెడ్డిని కలవనున్నట్లు-సమాచారం.

## పొలాల్లోకి దూసుకెళ్లిన పాఠశాల బస్సు
### విద్యార్థులకు తప్పిన ప్రమాదం

**ముదినేపల్లి, ఆగస్ట్ 6 :** ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెద్దకామనపూడిలో పెద్దప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో స్కూలు పిల్లలు క్షేమంగా బయపటడ్డారు. ప్రైవేటు-పాఠశాల బస్సు ప్రమాదానికి గురైంది. స్టీరింగ్ రాడ్ విరగడంతో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. స్థానికులు వెంటనే స్పందించి బస్సు అద్దాలు పగలగొట్టి విద్యార్థులను బయటకు తీశారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 27 మంది విద్యార్థులు ఉన్నారు. గాయపడిన విద్యార్థులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## బీసీ బిల్లుకు డీఎంకే ఎంపీ మద్దతు

**ఢిల్లీ, ఆగస్టు 6 :** బీసీ రిజర్వేషన్లు 42శాతం కేంద్రప్రభుత్వం అమలు చేయాలని కాంగ్రెస్ నేతలు బుధవారం జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టా రు. ఈ ధర్నాకు డీఎంకే ఎంపీ కనిమొళి మద్దతు తెలి పారు. ఈ సందర్భంగా ఢిల్లీ వేదికగా కనిమొళి మీడియా తో మాట్లాడారు. రిజర్వేషన్ల పరిమితిని తక్షణమే సవరించాలని డిమాండ్‌చేశారు. తరతరాలుగా వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడులో 69శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని ఉద్ఘాటిం చారు. డీఎంకే ఎంపీ కనిమొళి. పెరియార్ కాలం నుంచి రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ ఉందని గుర్తుచేశారు. దేశంలో పోరాటం చేసి రిజర్వేషన్లు పెంచుకున్న ఏకైక రా ష్ట్రం తమిళనాడు అని నొక్కిచెప్పారు. బీసీ రిజర్వేషన్లు పెంపు నకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలకు డీఎంకే పూర్తి మద్దతు ఇస్తోందని ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలకు అన్ని స్థాయిల్లో మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. పార్లమెంటులో కూడా ఈ అంశంపై తెలంగాణ ఎంపీలు చేసే పోరాటానికి డీఎంకే మద్దతు ఉంటుందని ఎంపీ కనిమొళి పేర్కొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

**హైదరాబాద్, ఆగస్టు 6 :** తమ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు జిల్లాల నుంచి భారీగా తరలివచ్చి, డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులపై పోలీసులు ఉక్కుపాదం మోపడంపై మండిపడ్డారు. మహిళా కార్మికులందరినీ బలవంతంగా పోలీసు వ్యాన్లలో ఎక్కించి, ఆయా పోలీసు స్టేషన్లకు తరలించారు. పెండింగ్ బకాయిలు చెల్లించకపోవడమే కాకుండా తమను అరెస్టు చేయడంపై మహిళా కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం..? ఇదేనా ప్రజా పాలన? అని వారు ప్రశ్నించారు. బడి పిల్లలకు భోజనం పెట్టే వ్యవస్థను కూడా సరిగ్గా నడపలేని ఈ చేతగాని రేవంత్ సర్కార్ తీరుపై కార్మికులు మండిపడ్డారు.

## కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట



**హైదరాబాద్, ఆగస్టు 6 :** కేంద్రం హెూం మంత్రి అమిత్‌షా పరువుకు భంగం కలిగించేలా వాఖ్యలు చేశారనే కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు జారా?ండ్‌లోని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రాహుల్ గాంధీ స్వయంగా చాయిబాసా కోర్టు ముందు బుధవారం హాజరయ్యారు. దీనికి ముందు, రాహుల్ గాంధీ కోర్టుకు హాజరవుతున్న నేపథ్యంలో కోర్టు చుట్టూ భద్రతను పెంచారు. శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని స్థానిక యంత్రాంగం భద్రతా ఏర్పాట్లు చేసింది. రాంచీ నుంచి చాయిబాసాకు రాహుల్ హెలికాప్టర్‌లో వచ్చారు. ఇందు కోసం టాటా కాలేజీ గ్రౌండ్స్‌లో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబుసోరెన్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు రాహుల్ మంగళవారంనాడు రాష్ట్రానికి వచ్చారు. రాహుల్ గాంధీ 2018లో జరిగిన ఒక ర్యాలీలో అమిత్‌షా పరువుకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ ప్రతాప్ కుమార్ అనే వ్యక్తి పరువునష్టం కేసు వేశారు. జూన్ 26న ప్రత్యేక కోర్టు ముందు రాహుల్ హాజరు కావాల్సి ఉండగా ఆయన తరఫు న్యాయవాది తన క్లయింట్ ఆరోజు హాజరుకాలేరని, ఆగస్టు 6వ తేదీని హాజరయ్యేందుకు వీలు కల్పించాలని కోర్టును కోరారు.

# గాంధీ కుటుంబాన్ని పొగడడానికే బిసి ధర్నా

- సోనియా, రాహుల్ జపంలో తరించిన రేవంత్
- జంతర్‌మంతర్ ధర్నాపై కిషన్ రెడ్డి ఎద్దేవా



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 6 :** జంతర్‌మంతర్‌లో కాంగ్రెస్ పార్టీ పెట్టుకున్న సభ.. గాంధీ కుటుంబాన్ని పొగడటానికే సరిపోయిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రాజకీయంగా ఎదురవుతున్న ఒత్తిడిని తట్టుకునేందుకు.. గాంధీ కుటుంబం అనుగ్రహం పొందాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ సభ పెట్టుకున్నారని ఆరోపించారు. ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న బీసీ ధర్నాపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి 31 నిమిషాల ప్రసంగంలో.. 50 శాతం కంటే ఎక్కువ సమయం రాహుల్, సోనియా జపం చేయడానికే సరిపోయిందని కిషన్ రెడ్డి విమర్శించారు. బీసీ రిజర్వేషన్లు ఇస్తామని తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారు.. దాన్ని పూర్తిచేసుకోవాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ దే అని ఆయన ఉద్ఘాటించారు. అందుకోసం న్యాయపరమైన, చట్టపరమైన అంశాలపై దృష్టిసారించి, చిత్తశుద్ధితో పనిచేయాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం అది చేయలేక.. బట్టకాల్చి బీజేపీ మీద వేస్తామంటే చూస్తు ఊరుకోమని కిషన్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. చట్టపరమైన, న్యాయపరమైన ప్రణాళిక లేకుండా.. కామారెడ్డి డిక్లరేషన్‌ను రాహుల్ గాంధీ ప్రకటించారని గుర్తు చేశారు. 18 నెలలు గడుస్తున్న సీఎం రేవంత్ రెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాల అమలు ఊసెత్తడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీని రేవంత్ రెడ్డి విమర్శిస్తే.. అది ఆకాశం మీద ఉమ్మేయడమే అని కిషన్ రెడ్డి విర్శించారు. వివిధ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు- చేయాలి కానీ ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని అన్నారు. రజకులు, గౌడ్లు.. ఇలా ఏ ఒక్క బీసీ వర్గాన్ని వదలకుండా అందరినీ కాంగ్రెస్ నిట్టనిలువునా మోసం చేసిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే.. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత బయటపడుతుందని నిర్వహించడం లేదన్నారు. రిజర్వేషన్ల పేరుతో డ్రామాలు ఆడుతున్నారు తప్ప.. సీఎం రేవంత్‌కు బీసీలకు సాధికారత కల్పించే విషయంలో చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. తెలంగాణలో ధర్నా చేస్తే.. ఎవరూ పట్టించుకోరని.. ఢిల్లీకి వచ్చి పగటివేషాలు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎవరు అధికారంలో ఉన్నా.. మజ్లిస్ పార్టీ చెప్పినట్లు-పనిచేస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారికంగా 10శాతం ముస్లింలను బీసీల్లో చేర్చి 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తే.. బీసీలకు రాజ్యాధికారం కష్టమేననేది తెలంగాణ సమాజానికి అర్థమైందన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ముస్లింలతో కూడిన బీసీ రిజర్వేషన్లను బీజేపీ అంగీకరించదని తేల్చి చెప్పారు. దేశంలో మోదీ నేతృత్వంలో ప్రజలకు సుస్థిరమైన పాలన అందుతోదని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు.

## యూపిఐ పేమెంట్లకు ఛార్జీలు తప్పవా?




**ముంబై, ఆగస్ట్ 6 :** యూపీఐ సర్వీసులు ఎప్పటికీ ఉచితంగానే అందుబాటులో ఉంటాయా? అన్న ప్రశ్నకు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందించారు. ఎంపీసీ నిర్ణయాల ప్రకటన తర్వాత ఆయన మీడియాతో ఆయన మాట్లాడారు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను నడిపేందుకు అయ్యే ఖర్చును కాలక్రమేణా ఎవరైనా భరించాల్సి ఉంటుందన్నారు. యూపీఐ సర్వీస్‌లు ఎప్పుడూ ఉచితంగానే అందుబాటులో ఉంటాయన్న విషయం తాను చెప్పలేనన్నారు. ఆపరేషన్‌కు సంబంధిం చిన ఖర్చులు ఉన్నాయని.. ఖర్చును ఎవరైనా భరించాల్సి ఉంటుందన్నారు. ఎవరు చెల్లిస్తారనేది ముఖ్యమని.. కానీ ఎవరు చెల్లిస్తున్నారనే ముఖ్యం కాదన్నారు. ఈ మోడల్ స్థిరత్వం, సమష్టిగా, వ్యక్తిగతంగా ఆపరేషన్ కోసం చెల్లింపులు ముఖ్యమన్నారు. యూపీఐ వ్యవస్థపై విధిస్తున్న చార్జీలపై నివేదికల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## ఉత్తరాఖండ్ వరదల్లో 28మంది కేరళ పర్యాటకుల గల్లంతు

**డెహ్రాడూన్, ఆగస్ట్ 6 :** ఆకస్మిక వరదలతో ఉత్తరాఖండ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. మంగళవారం ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలోని ధరాలి, సుఖీ అనే గ్రామాలను వరదలు ముంచెత్తాయి. భారీ వర్షం కారణంగా మెరుపు వరద ధరాలి గ్రామాన్ని సగం తుడిచిపెట్టేసింది. కళ్లముందే ఇళ్లు, వాహనాలు కొట్టు-కుపోయాయి. ప్రాణాలు రక్షించుకునేందుకు పరుగెత్తుతున్న వారిని వరద రాకాసిలా ముంచెత్తింది. దీంతో పదుల సంఖ్యలో జనాలు బురదలో కూరుకుపోయారు. ఇండ్లు, హోటళ్లను బురద ముంచెత్తింది. దాదాపు 25 హోటళ్లు కొట్టుకుపో యాయి. వరద కారణంగా ఇప్పటివరకు ఐదుగురు మరణించినట్లు-అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో కేరళకు చెందిన 28 మంది పర్యాటకుల బృందం గల్లంతు అయినట్లు-తెలుస్తోంది. ఉత్తరకాశి నుండి గంగోత్రికి బయలుదేరుతున్న సమయంలో వారు చివరిసారిగా తమతో మాట్లాడారని.. ఇప్పుడు వారి ఫోన్లు పనిచేయడం లేదని పర్యాటకుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. సంఘటనా స్థలంలో ప్రస్తుతం భారత సైన్యం, సహా యక బృందాల నేతృత్వంలో సహాయక చర్యలు ముమ్మ రంగా జరుగుతున్నాయి. భారీ వరదలతో కొట్టు-కుపో యిన రోడ్లు, కూలిపోయిన వంతెనల కారణంగా సహా యక చర్యలకు ఆటంకం కలుగుతోంది. ధరాలి నుండి ఇప్పటివరకు 130 మందికి పైగా ప్రజలను రక్షించారు. అయితే, కేరళ పర్యాటక బృందం ఆచూకీ ఇంకా తెలియలేదు.

## పార్టీ ఆదేశాల మేరకు పనిచేశా

- ఫామ్‌మౌజ్‌లో వందకోట్లకు అమ్ముడుపోలే
- ప్రజలను మరచి విన్యాసాలు చేస్తున్న పార్టీలు
- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సంచలన వ్యాఖ్యలు



**నాగర్ కర్నూలు, ఆగస్ట్ 6 :** గతంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఏం ఆదేశిస్తే అదే తాను చేశానని బీఆర్ఎస్‌ను వీడిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు.. ఆ పార్టీపై సంచలన వ్యాఖలు చేశారు. పేదరిక నిర్మూలన.. ప్రజల పక్షమే తన పంతమని పేర్కొన్నారు. తనకు.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అది నాయకత్వం నుంచి పిలుపు వచ్చిందన్నారు. కానీ తన వాయిస్ ప్రజల పక్షాన బతికి ఉండాలంటే.. స్వేచ్ఛ ఉన్న పార్టీ తనకు కావాలని పేర్కొన్నారు. తొందరలో తన దారి ఏమిటో నిర్ణయిస్తానని స్పష్టం చేశారు. బుధవారం నాగర్ కర్నూలులో గువ్వల బాలరాజు విలేకర్లతో మాట్లాడుతూ.. అసమర్థ నాయకత్వం కుట్రలు చేసి తనను ఓడించిందంటూ బీఆర్ఎస్ పార్టీపై మండిపడ్డారు. అన్యాయాన్ని ఎదిరించే పాత్రను ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ పోషించడం లేదన్ని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలకు కష్టకాలంలో పార్టీ అధినాయకత్వం అండగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రజలు ఏమి ఆశిస్తున్నారో అది చేయకుండా.. అధికార, ప్రతిపక్ష పార్టీలు మాటల యుద్ధం చేసుకుంటున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జీబీఆర్ రూ. 100 కోట్లకు అమ్ముడు పోలేదని స్పష్టం చేశారు. గువ్వల బాలరాజు అంటేనే ఒక సెన్సేషన్..జీబీఆర్ ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడకూడదంటే ఒప్పుకోడంటూ తన అభిప్రాయాన్ని ఈ సందర్భంగా కుండ బద్దలు కొట్టారు. తనతో కలిసి రావాలంటూ ప్రజలకు ఈ సందర్భంగా గువ్వల బాలరాజు పిలుపునిచ్చారు. భారత రాష్ట్ర సమితికి మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆగస్ట్ 4వ తేదీ అంటే సోమవారం రాజీనామా చేశారు. ఆ రాజీనామా లేఖను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు పంపారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా బాలరాజు ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆ పదవికి సైతం ఆయన రాజీనామా చేశారు. బిఆర్ఎస్‌కి మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సోమవారం రాజీనామా చేశారు. ఆ రాజీనామా లేఖను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు పంపారు. ఆ లేఖలో ఆయన కీలక విషయాలను ప్రస్తావించారు. పార్టీకి కు రాజీనామా నిర్ణయం అంత ఈజీగా తీసుకున్నది కాదన్నారు. ఎంతో ఆలోచించి.. ఎన్నో విషయాలను పరిగణలోకి తీసుకుని అనంతరం బాధతో పార్టీని వీడుతున్నట్లు- ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే గత రెండు దశాబ్దాలుగా కేసీఆర్ నాయకత్వంలో పని చేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఆ సమయంలో తాను ఎన్నో విషయాలు నేర్చుకున్నానని పేర్కొన్నారు. కేసీఆర్ వల్లే తాను ఈ స్థాయికి వచ్చానని స్పష్టం చేశారు. కష్ట సమయంలో పార్టీని వీడడం బాధగా ఉన్నా.. భవిష్యత్తు కోసం తప్పడం లేదంటూ ఆ లేఖలో గువ్వల బాలరాజు వివరించారు. మరోవైపు.. గువ్వల బాలరాజు ఆడియో అంటూ ఒక కథనం మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. అదీకాక మరికొద్ది రోజుల్లో భారతీయ జనతా పార్టీ కండువా కప్పుకోనున్నారన ప్రచారం సాగుతోంది. ఆయనతో పార్టీ బీఆర్ఎస్ పార్టీని వీడిన మాజీ ఎమ్మెల్యేలు ఇద్దరు సైతం గువ్వల బాలరాజు బాటలోనే నడవనున్నారనే ఒక చర్చ సైతం సాగుతోంది. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా బాలరాజు ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆ పదవికి సైతం ఆయన రాజీనామా చేశారు.

# పెళ్లైన ఐదు నెలలకే నవ వధువు ఆత్మహత్య



**న్యూఢిల్లీ, ఆగస్టు 6 :** కోటి ఆశలతో అత్తింట్లో అడుగుపెట్టిన ఓ మహిళ.. పెళ్లైన ఐదు నెలలకే తనువు చాలించింది. భర్త వేధింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడింది. అయితే, భర్త మాత్రం తన భార్య ఆత్మహత్య చేసుకుందని చెప్తుండగా.. యువతి కుటుంబం మాత్రం కట్నం కోసం తమ బిడ్డను హింసించి హత్య చేశారని ఆరోపిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్నోకు చెందిన అనురాగ్ సింగ్ హాంకాంగ్‌కు చెందిన షిప్ మేనేజ్‌మెంట్ సంస్థలో సెకండ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి మధు (32) అనే మహిళతో ఈ ఏడాది ఫిబ్రవరి 25న వివాహం జరిగింది. అయితే, వివాహం సమయంలో రూ.15 లక్షలు కట్నం డిమాండ్ చేసినట్లు యువతి తల్లిదండ్రులు ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను కూడా యువతి ఫ్యామిలీ చూపించింది. పెళ్లి సమయంలో రూ.5 లక్షలు ఇవ్వగలిగినట్లు చెప్పారు. అయితే, పెళ్లైన తర్వాత అనురాగ్ తనకు కట్నం కోసం పదేపదే ఫోన్ చేసి ఒత్తిడి చేశాడని మధు తండ్రి ఫతే బహదూర్ సింగ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్లైన నెలలోపే తొలిసారి తన కూతురు మధుపై అల్లుడు అనురాగ్ దాడి చేశాడని, దీంతో ఆమె పుట్టింటికి తిరిగి వచ్చినట్లు చెప్పారు. అడిగిన కట్నం చెల్లించామని.. దీంతో బిడ్డను తిరిగి తీసుకెళ్లినట్లు వివరించారు. అయితే, తన కూతురిని హింసించడం మాత్రం ఆపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాదు అనురాగ్ వేరే అమ్మాయితో వివాహేతర సంబంధంలో ఉన్నాడని ఆరోపించారు. ఇటీవలే ఓ హెూటల్‌లో తన మాజీ ప్రియురాలితో ఓ రాత్రి గడిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. జులై 31న హెూటల్ బుకింగ్‌కు సంబంధించిన వివరాలను కూడా ఫిర్యాదులో పంచుకున్నారు. ఆగస్టు 3 ఆదివారం అనురాగ్ తనపై దాడి చేసినట్లు మధు తన అక్క ప్రియతో చెప్పినట్లు యువతి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కూతురు గర్భవతి అని, తనను కడుపు తీయించుకోమని ఒత్తిడి చేసినట్లు చెప్పారు. 'ఆగస్టు 4న సాయంత్రం 4:32 గంటలకు అతను ఫోన్ చేసి నా కూతురు ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని చెప్పాడు. అతడే నా కూతురిని చంపాడని నేను అనుకుంటున్నాను' అని మధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు మధు అక్క ప్రియ మాట్లాడుతూ.. 'నా చెల్లి చాలా లైవ్‌లీ పర్సన్. కానీ అనురాగ్ మాత్రం ఆమె ఎవరితోనూ మాట్లాడటం ఇష్టపడేవాడు కాదు. స్నేహితులతో కూడా మాట్లాడనిచ్చే వాడు కాదు. ఆఖరికి మాతో కూడా మాట్లాడొద్దని చెప్పేవాడు. అతను ఊర్లో లేనప్పుడు మాత్రమే మేము మాట్లాడుకునే వాళ్లం. ఆమె ఫోన్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేసేవాడు. ఎటువంటి కారణం లేకుండానే మా చెల్లిని కొట్టేవాడు. తనతో కలిసి డ్రింక్ చేయమని ఒత్తిడి తెచ్చేవాడు. చివరి సారిగా తనతో మాట్లాడినప్పుడు.. అనురాగ్ కొట్టినట్లు చెప్పింది. అప్పుడు తనని ఇంటికి తీసుకురావాలని అనుకున్నాను. కానీ మళ్లీ గొడవ జరుగుతుందనే భయంతో ఆగిపోయాను' అంటూ చెప్పుకొచ్చింది.

# బీసీలపై కాంగ్రెది దొంగ ప్రేమ

- 50ఏళ్ల పాలనలో బీసీలకు ఎనలేని నష్టం
- కేంద్ర మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, ఆగస్టు 6 :** 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఏనాడైనా బీసీలను పట్టించుకున్న దాఖలాలు ఉన్నాయా?.. సీఎంను చేసిన లెక్కలు ఉన్నాయా ఉంటే చెప్పాలని కేంద్ర మంత్రి బండిసంజయ్ ప్రశ్నించారు. ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా చేస్తోందని ఆరోపణలు చేశారు. ఇది కామారెడ్డి డిక్లరేషన్ కానే కాదని.. ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషనేనని విమర్శలు చేశారు. బీసీలకు 5శాతం పెంచి.. ముస్లింలకు అదనంగా పదిశాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కుట్ర చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఢిల్లీ వేదికగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. బీసీ ముసుగులో ముస్లింలకు వంద శాతం రిజర్వేషన్లను అమలు చేసే కుట్ర జరుగుతోందని ఆక్షేపించారు. కాంగ్రెస్ ధర్నాకు బీసీల మద్దతు కరువైందని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తేనే మద్దతిస్తామని క్లారిటీ ఇచ్చారు. బీసీలకు ఏ పార్టీ ఏం చేసిందో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు బండి సంజయ్. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎన్నడైనా బీసీని ప్రధాని చేశారా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 48 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీనైనా సీఎం చేశారా? అని నిలదీశారు. తెలంగాణ కేబినెట్, నామినేటెడ్ పదవుల్లో ఎంతమంది బీసీలకు ఇచ్చారో చర్చిద్దామా? అని సవాల్ విసిరారు. లోక్‌సభ సభ్యుల్లో ఎంతమంది బీసీలకు సీట్లిచ్చారో సమాధానమివ్వగలరా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ పార్టీనా బీసీల గురించి తమకు నీతులు చెప్పేది? అని నిలదీశారు. బీసీని ప్రధాని చేసిన ఘనత బీజేపీదేనని ఉద్ఘాటించారు బండి సంజయ్. 27మంది బీసీ కేంద్రమంత్రులను, అనేక రాష్ట్రాలకు బీసీ సీఎంలను నియమించిన ఘనత బీజేపీదేనని బండి సంజయ్ కేంద్రంపై నెపం మోసిందని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల నుంచి కాంగ్రెస్ నేతలు తప్పుకోవాలనుకుం టున్నారని ధ్వజమెత్తారు. యూపీ, బెంగాల్, బిహార్ తరహాలో తెలంగాణలోనూ కాంగ్రెస్ కనుమరుగవడం తథ్యమని బండి సంజయ్ హెచ్చరించారు. ఈరోజు న్యూఢిల్లీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముస్లింలకు వంద శాతం రిజర్వేషన్లు కల్పించేందుకే జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తోందే తప్పా బీసీల కోసం కానేకాదని స్పష్టం చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌పై కాంగ్రెస్ మాట తప్పిందని విమర్శించారు. మైనార్టీ ఓట్ల కోసం ముస్లిం డిక్లరేషన్‌ను అమలు చేయాలనుకుంటోందని విమర్శించారు. బీసీలను ఘోరంగా మోసం చేస్తోంది. అందుకే కాంగ్రెస్ ధర్నాకు బీసీల మద్దతు కరువైందని బండి సంజయ్ ఆక్షేపించారు.



## ఉత్తరాది రాష్ట్రాలను ముంచెత్తుతున్న వరదలు
### చిక్కుకుపోయిన యాత్రికులు

**ఢిల్లీ, ఆగస్టు 6 :** హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను ఆకస్మిక వరదలు చుట్టుముడుతున్నాయి. ఉత్తరకాశీ జిల్లాలో జలవిలయం బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా హిమాచల్ ప్రదేశ్‌లో మెరుపు వరదలు బీభత్సం సృష్టించాయి. హిమాచల్ రాష్ట్ర వ్యాప్తంగా గతకొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. టాంగ్లింగ్ ప్రాంతంలో కురిసిన వర్షం కారణంగా కిన్నెర్ కైలాష్ యాత్ర మార్గంలో ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ వరదల్లో వందలాది మంది యాత్రికులు పర్వత మార్గంలో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. సాహసోపేతమైన ఆపరేషన్ చేపట్టారు. రోప్‌వే సాయంతో దాదాపు 413 మంది యాత్రికులను రక్షించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. కాగా, రెండు రోజుల నుంచి హిమాచల్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు చాలాచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. ఈ కారణంగా దాదాపు 450 రోడ్లను అధికారులు మూసివేశారు. ముఖ్యంగా మండి జిల్లా అత్యంత ప్రభావితమైంది. ఇక్కడ దాదాపు 295 రోడ్లు మూసుకుపోయాయి. ఇక సిమ్లాలోని చక్కీమోర్ వద్ద కొండచరియలు విరిగిపడటంతో కీలకమైన చండీగఢ్-సిమ్లా జాతీయ రహదారిని అధికారులు మూసివేయాల్సి వచ్చింది. రాష్ట్రంలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉనా, కాంగ్రా, మండి, సిర్మౌర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ఆ నాలుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

## మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే
### మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



**సూర్యాపేట, ఆగస్టు 6 :** వచ్చే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని, కేసీఆరే మళ్లీ సీఎం అవుతారని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం నివేదిక, ఢిల్లీలో కాంగ్రెస్ బీసీ ధర్నాపై మాజీమంత్రి జగదీష్ రెడ్డి స్పందించారు. అది కాళేశ్వరం కమీషన్ రిపోర్ట్ కాదు.. కాంగ్రెస్, బీజేపీల ఆరోపణల చిట్టా అని విమర్శించారు. అసలు కమీషన్ రిపోర్ట్ తొక్కిపెట్టి కాంగ్రెస్ సొంత కథలు అల్లుతోంది. కాళేశ్వరమే తెలంగాణాకు జీవ ధార. మళ్ళీ కేసీఆర్ వస్తాడు కాళేశ్వరం నీరు అందిస్తారు. మోదీ, చంద్రబాబు డైరెక్షన్‌లో కేసీఆర్‌ను బద్నాం చేయాలని కుట్ర చేస్తున్నారు. కాళేశ్వరం నివేదిక పేరుతో కాంగ్రెస్ మోసపూరిత ప్రచారం చేస్తోంది. కాళేశ్వరం నీళ్ళ కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు పోరాటానికి సిద్ధమౌతున్నారు. బనకచర్ల కోసమే కాళేశ్వరాన్ని పండబెడుతున్నారు. కాళేశ్వరం కుట్రలపై శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం అని జగదీశ్ రెడ్డి తేల్చిచెప్పారు. అరెస్టులు ఉండొచ్చని చిల్లర ప్రచారం చేస్తున్నారు.. ఈ బెదిరింపులకు భయపడేది లేదు. స్థానిక ఎన్నికల్లో లబ్ది కోసమే కాంగ్రెస్ చిల్లర ప్రయత్నం చేస్తోంది. డైవర్షన్ పాలిటిక్స్‌తో విషప్రచారం చేసి మరోసారి ప్రజల్ని మోసం చేయాలని కాంగ్రెస్ చూస్తుంది. బీసీ రిజర్వేషన్ పేరుతో కాంగ్రెస్ మోసం చేస్తుంది. కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో ఓట్లు వేయించుకుని జంతరమంతర్ వద్ద ధర్నా పేరుతో కాంగ్రెస్ పార్టీ వేషాలు వేస్తుంది. అన్ని రంగాల్లో కాంగ్రెస్ విఫలమై కప్పిపుచ్చుకునేందుకు నాటకాలు ఆడుతుందని ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు.

# ట్రంప్ విపరీత ధోరణలకు సవాల్ విసరాలి!



ట్రంప్ విపరీత ధోరణి ప్రపంచానికి పెను సవాల్ కానుంది. ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు చూస్తుంటే అమెరికాకు గులాంగిరీ చేయాలన్న ధోరణి కనిపిస్తోంది. వివిధ దేశాలపై అక్కసు వెళ్లగక్కడం, విపరీతంగా సుంకాలు విధించడం, మేం చెప్పినట్లుగానే నడచుకోవాలనడం, ఫలానాదేశంతో వాణిజ్యం చేయవద్దు, అమెరికా వచ్చే విద్యార్థులపై ఆంక్షలు పెట్టడం వంటివన్నీ పిచ్చోడి చేతిలో రాయిలా ఉన్నాయి. ఇంత దారుణంగా గతంలో ఏ రాజ్యాధినేతా వ్యవహరించలేదు. ఎవరు ఎవరితో వ్యాపార్యం చేయాలో నిర్ణయించ డానికి ట్రంప్ ఎవరు. మార్కెట్లో సరుకులు ఎక్కడ కొనాలన్నది ట్రంప్ ఆదేశిస్తే ఎలా? ఏ దేశమైనా తాను ఉత్పత్తి చేసే సరుకులను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంది. తనకు అవసరమైన వస్తువులను అనువైన ధరలకు ఇచ్చే దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. వ్యాపారా, వాణిజ్య పరంగా ఆయా దేశాలకు ఉన్న స్వేచ్ఛ ఇది. ఎక్కడి నుంచి ఎంతకు కొనాలో, సుంకాలు ఎంతెంత ఉండాలో ఏ దేశమూ ఏకపక్షంగా నిర్ణయించజాలదు. అమెరికా ఆధిపత్య ధోరణి ఈ ప్రాథమిక నియమానికి భిన్నంగా ఉంది. ఇతర దేశాలతో పోలిస్తే రష్యా అత్యంత చౌకగా ముడి చమురు, సహజ వాయువును సరఫరా చేస్తోంది. భారత్, చైనా తమ అవసరాలకు రష్యా నుంచి కొనుగోలు చేస్తున్నాయి. అమెరికా అనుంగు ఆయిల్ కంపెనీలకు ఇది నష్టదాయకంగా పరిణమించి ఉండవచ్చు. దీంతో, రష్యాతో ఎలాంటి వాణిజ్య లావాదేవీలు జరిపినా ఊరుకునేది లేదని నెలరోజుల క్రితం అమెరికా హూంకరించింది. అమెరికా బెదరింపులకు అనుకూలంగా తలూపితే మన వ్యవసాయ, పాడి పరిశ్రమ రంగాలకు తీవ్రమైన నష్టం జరుగుతుంది. పెట్రో ధరలు పెచ్చు పెరిగి, నిత్యావసరాలపైనా ఆ భారం పడుతుంది. ఇప్పటికే నిరుద్యోగం, అల్పాదాయాలు, అధిక ధరలతో సతమతమవుతున్న దేశ ప్రజానీకానికి ఇది మరింత దుర్భర స్థితిని కలిగిస్తుంది. కాబట్టి మోడీ ప్రభుత్వం దేశ సార్వభౌమత్వాన్ని నిలబెట్టేలా అమెరికాకు గట్టి సమాధానం చెప్పాలి. దేశ ప్రగతికి, ప్రజలకు నష్టం కలిగించే వాణిజ్య ఒప్పందాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించ కూడదు. నష్టదాయక ఒప్పందాలకు లొంగకుండా గొంతెత్తాలి! అమెరికాను బ్యాన్ చేసే దాకా పోరాడాలి. ఇదే సందర్భంలో నాటో కూటమి సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే కూడా తీవ్రమైన పరిభాషతో మన దేశాన్ని హెచ్చరించాడు.

రష్యాతో వాణిజ్య వ్యాపారాలను వెంటనే నిలిపేయాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి వస్తుందని బెదిరింపులకు తెగించాడు. ఒక సర్వ సత్తాక స్వతంత్ర దేశాన్ని ఇలా బెదిరించటానికి అతడికున్న హక్కు ఏమిటి. ఇలాంటి పెడ ధోరణులను సహించడం సరికాదు. ఆదిలోనే తుంచేయాలి. అంతేనా అంటే మనతో శతృత్వం పెంచుకున్న పాక్‌ను చేరదీయడం, దానికి ఆయుధ సంపత్తిని, ఆయిల్‌ను పంపడం, ఆర్థిక సాయం చేయడం పాముకు పాలు పోసి పెంచడం తప్ప మరోటి కాదు. అమెరికాలో ట్విన్ టవ్స్ కూల్చివేతను ట్రంప్ మరచినట్టు ఉన్నాడు. పాక్‌ను పెంచి పోషిస్తున్న ట్రంప్‌కు గుణపాటం తప్పదు. ఒకపక్క మోడీ తానే ట్రంప్‌కు ప్రియమైన మిత్రుడైనట్టు పోజులిస్తుంటే– అమెరికా నుంచి ఈ తరహా పరోక్ష, ప్రత్యక్ష అదిలిం పులూ, ఒత్తిళ్లలో అర్థమేమిటన్నది విశ్లేషించాలి. ఇలాంటి ధోరణులపై భారత్ తక్షణం స్పందించాలి. ఆధిపత్య ధోరణికి అహంకారమూ, అరాచకమూ తోడైతే ఎలా ఉంటుందో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరుతెన్నులను పరికిస్తే అర్థమవుతుంది. ట్రంప్‌ను మోసిన ఎలాన్ మస్క్‌నే మోసం చేసిన ఘనుడు ట్రంప్. ఎన్నికల ముందు మస్క్‌తో దోస్తానా కట్టి డబ్బులు ఖర్చు పెట్టించి ఇప్పుడు మస్క్‌కే మస్కా కొట్టాడంటే ట్రంప్ ఎంతటి ద్రోహియో అర్థం చేసుకోవాలి. తాను అనుకుంటున్న ట్టుగా ప్రపంచాన్ని నడిపిం చాలని అనుకుంటున్నాడు. అందుకే సుంకాలతో బెదరిస్తూ.. కర్రపెత్తనం చెలాయించాలని చూస్తున్నట్లుగా ఉంది. దీనికి ప్రపంచ దేశాలు ఏకమై ఎదురుదాడికి దిగాలి. నిజానికి భారత్ గట్టిగా పిలుపునిస్తే ఎక్కడో పడిపోతాడు. రెండోసారి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచీ పేట్రేగుతున్న తీరును మొగ్గలోనే తుంచేయాలి. అధిక సుంకాలు విధిస్తానని గత ఏప్రిల్‌లోనే ఇండియా, చైనా, బ్రెజిల్, మెక్సికో, కెనడా సహా 30 దేశాలను బెదిరించిన ట్రంప్ చైనా తదితర దేశాల నుంచి ఎదురు సుంకాలు గొంతెత్తటంతో– అమలుకు 90 రోజులు గడువంటూ మిన్నకున్నాడు. ఒకపక్క ఇండియా – అమెరికా మధ్య చర్చలు జరుగుతుండగానే– మన ఎగుమతులపై 25 శాతం సుంకాలను విధించటం, ఇది ఆగస్టు 1 నుంచే అమల్లోకి వస్తుందంటూ ఏకపక్షంగా ప్రకటించటం అమెరికా ఆధిపత్య ధోరణికి, ట్రంప్ అహంకార వైఖరికి నిదర్శనంగా చూడాలి. ఏదోవిధంగా మనదేశంపై తీవ్ర ఒత్తిడి తెచ్చి, తమ వాణిజ్య ప్రయోజనాలను సాధించాల న్నది అమెరికా వ్యూహంగా ఉన్నట్లుగా ఉంది. అయితే ట్రంప్ పెడధోరణిని అక్కడి ప్రజలే సహించడం లేదు. దీనికి భారత్ నుంచి సరైన, దీటైన సమాధానం ఇవ్వటం చాలా అవసరం. అవసరమైతే అన్నదేశాలను కూడగట్టాలి. ట్రంప్ తెంపరితనాన్ని ఎండగట్టాలి. అమెరికా ఫస్ట్ అన్న నినాదం తలకెత్తుకున్న ట్రంప్... ముంచుకొస్తున్న ఆర్థికమాంద్యం నుంచి తప్పించుకో వటానికి అధిక సుంకాలు విధించటం, యుద్ధ భయాలను పెంచటం ఓ గొప్ప పరిష్కారంగా ఎంచుకొని ఆ దిశగా పావులు కదుపుతున్నాడు.

ఇది సహించాల్సిన అవసరం లేదు. విస్తారమైన వ్యాపార అవకాశాలు ఉండడంతో మనదేశంలోకి తమ వ్యవసాయ, డైరీ ఉత్పత్తులతో ముంచెత్తాలని అమెరికా తీవ్ర ఒత్తిడి తెస్తోంది. మోడీ ప్రభుత్వం ఆ ఒత్తిళ్లకు తలొగ్గి, ఇప్పటికే లక్షల కోట్ల విలువైన ఆయుధాల కొను గోలుకు, చమురు దిగుమతికి అంగీకరించింది. మరింత వాణిజ్య చొరబాటుకు ట్రంప్ పరివారం మంత్రాంగం నడుపుతోంది. వ్యవసాయ, పాల ఉత్పత్తులు, ఔషధ రంగాల్లోకి తన కార్పొరేట్ తాబేదార్లను దించాలని ప్రయత్నిస్తోంది. ఈ పన్నాగంతోనే తీవ్ర ఒత్తిళ్లకు, పెత్తందారీ పోకడలకు దిగుతోందని అర్థం చేసుకోవచ్చు. వీటికి తలొగ్గకుండా మేకిన్ ఇండియా అంటున్న మోడీ గట్టిగా స్వదేశీ నినాదంతో ముందుకు సాగాలి. నిలబడి కొట్లాడాలి. మనదేశంలో మన వస్తువులే వాడితే ప్రపంచ దేశాల పెత్తనం ఉండదు. ట్రంప్ తలనొప్పి ఉండదు. భారత టెక్కీలు అమెరికా వీడితే మన పవర్ ఏమిటో తెలుస్తుంది.

# అమ్మతనాన్ని అమ్ముకున్న నమ్రత

## ఫర్టిలిటీ సెంటర్లపై నమ్మకం కోల్పోయేలా చేసిన సృష్టి

**హైదరాబాద్, ఆగస్ట్ 6 :** అమ్మతనాన్ని కూడా అమ్ముకోవడమెలాగో సృష్టి ఫర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత చూపించా రు. ఇందులో బయటపడ్డ నిజాలు ఇప్పుడు విపరీత ధోరణలును బయటపెట్టాయి. ఇలాంటి సెంటర్లు ఎన్ని ఉన్నాయో వాటి కార్య కలాపాలపైనా దృష్టి సారించాలి. సరోగసీ పేరుతో ఇతరల పిల్లలను అప్పగించి లక్షల్లో దండుకోవడమనే వ్యాపారంలో నమ్రత బాగా ఆర్జించారు. కొన్నేళ్ల క్రితమే మోసాలు బయటపడి నమ్రత లైసెన్స్ రద్దు కావడంతో ఆమె ఇతర వైద్యులను బినామీగా పెట్టుకుని వారి పేరిట లైసెన్స్ తీసుకుని హైదరాబా ద్, విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, కర్ణాటక, ఒడిసా, కోల్‌కతా తదితర ప్రాంతాల్లో సృష్టి ఫర్టిలిటీ– సెంటర్ శాఖలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఎంతోమంది దంపతు లను సరగసీకి ఒప్పించిన డాక్టర్ నమ్రత.. ఒక్కో జంట నుంచి రూ.30 నుంచి రూ.50 లక్షల వరకు దోచుకున్నట్లు పోలీసులు గుర్తించారని తెలిసింది. అనేక కోణాల్లో విచారించిన పోలీసులు ఆమె స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయిస్తుండగా ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు– పోలీసులు తెలిపారు. బాధి తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నమ్రత ముఠాలో కీలక పాత్ర పోషించి కల్యాణి, సంతోషిలను పోలీసులు విచారిస్తున్నారు. ఇప్పటికే




15 మందిని అరెస్టు చేయగా.. మరికొందర్ని అరెస్టు చేయవచ్చని సమాచారం. ఈ క్రమంలో పోలీసుల విచారణలో సికింద్రాబాద్ సృష్టి ఫర్టిలిటీ– సెంటర్ ఆక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటంతో ప్రధాన నిందితురాలు, ఆ కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఆమెను ఐదు రోజులు కస్టడీకి తీసు కుని విచారించిన గోపాలపు రం పోలీసులు... సృష్టిలో మోసాలపై కీలక విషయాలు రాబట్టిన ట్లు తెలిసింది. మంగళవారం పోలీసు కస్టడీ ముగియడంతో ఆమెను మేజిస్ట్రేట్ ఎదుట హాజరపరిచి, తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు. మరోవైపు, సోమవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న బినామీ డాక్టర్ విద్యుల్లతను పోలీసులు విచారించి సృష్టిలో మోసాలపై కీలక ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ఇటీవల నమ్రత రాజస్థా న్‌కు చెందిన గోపాల్ సింగ్ దంపతులను సరగసీ పేరిట నమ్మిం చి.. మోసగించిన విషయం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిం దే. ఒడిసా దంపతులకు పుట్టిన బిడ్డను రూ.90 వేలకు కొన్న నమ్రత.. ఆ బిడ్డను రాజస్థాన్ దంపతులకు రూ.35 లక్షలకు విక్రయించింది. సరగసీ పేరుతో శిశు విక్రయాలకు పాల్పడు తున్న నమ్రతకు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌కు చెందిన చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాలతో సంబంధాలు ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైందని తెలిసింది. ఆ ముఠాల కు బట్టి రూ.లక్ష నుంచి 5 లక్షల వరకు చెల్లించి చిన్నారులను కొంటున్నట్లు గుర్తించారు. ఆ పిల్లల్నే సరగసీ ద్వారా పుట్టినట్లు నమ్మించి పిల్లలు లేని దంపతుల నుంచి రూ.30 నుంచి 50 లక్షలు తీసుకుంటున్నట్లు తేలింది. ఈ దందాలో హర్ష, పవన్, నందిని అనే వ్యక్తులు కీలకంగా వ్యవహరించినట్లు– పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. ఈ ఒక్క కేసు ఆధారంగా మిగతా ఫర్టిలిటీ సెంటర్ల తీరును పరిశీలించాలి. వాటి కార్యకలాపాలపై దృష్టి సారించాలి.

# సృష్టి ఫెర్టిలిటీ కేసులో 17 మంది అరెస్టు

**హైదరాబాద్, ఆగస్టు 6 :** గోపాలపురం సృష్టి ఫెర్టిలిటీ హాస్పిటల్ కేసులో తాజాగా 6 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు, వారిని రిమాండ్‌కు తరలించారు. ఇప్పటివరకు మొత్తం 17 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సమాచారం. అరెస్ట్ అయిన వారిలో డాక్టర్లు, ఏజెంట్లు ముఖ్యంగా మహిళా ఏజెంట్లు అధికంగా ఉన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న డాక్టర్ నమ్రతపై ఒక్క గోపాలపురం పోలీస్ స్టేషన్‌లోనే 8 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఆమెతో పాటు ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ విద్యులతను కూడా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు డాక్టర్ నమ్రతకు చెందిన బ్యాంక్ ఖాతాలు, హాస్పిటల్ అకౌంట్లు ఫ్రీజ్ చేశారు. ఈ ఖాతాల్లో కోట్ల రూపాయల నగదు జమై ఉందని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం మరికొన్ని ఖాతాలను కూడా గుర్తించే పనిలో ఉన్నారు. ఇప్పటివరకు దర్యాప్తులో బయటపడిన వివరా ల ప్రకారం, సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ద్వారా 70కి పైగా భార్యాభర్తలు చికిత్స కోసం వచ్చి, సరోగసి పేరుతో మోసపోయారని పోలీసులు వెల్లడించారు. సృష్టి ఫెర్టిలిటీ హాస్పిటల్ డాక్టర్ నమ్రత తోపాటు మరికొందరూ చైల్డ్ ట్రాఫికింగ్‌కు పాల్పడ్డట్లు పక్కా ఆధారాలు లభించాయి. గోపాలపురం పోలీసులు మరోసారి సృష్టి హాస్పిటల్‌కి వెళ్లి కీలక డాక్యుమెంట్లు, రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఇవి కేసుకు మద్దతుగా కీలక ఆధారాలుగా మారనున్నాయి. అలాగే, ఈ రోజు మరో కొన్ని అరెస్టులు జరగవచ్చని సమాచారం. నిందితుల జాబితా ఇంకా పెరిగే అవకాశం ఉంది. పోలీసులు డాక్టర్ నమ్రత అనుబంధంగా ఉన్న ఇతర హాస్పిటళ్లను, ఆసుపత్రుల్లోని కార్యకలాపాలను పరిశీలిస్తున్నారు. అక్రమంగా సంపాదించిన డబ్బును వేరే అకౌంట్లలోకి మళ్లించి ఉండే అవకాశం ఉన్నందున ఆ దిశగా విచారణ జరుగుతోంది. ఈ కేసు కేంద్రం దృష్టికి వెళ్లే అవకాశం కూడా ఉంది. ఎందుకంటే.. చిన్నారుల అక్రమ రవాణా వంటి విషయాల్లో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించనున్నాయి.

## బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ డ్రామాలు : ఎంపీ వద్దిరాజు

**న్యూఢిల్లీ, ఆగస్టు 6 :** బీసీలను రిజర్వేషన్ల పేరుతో మరోసారి మోసం చేయడానికి కాంగ్రెస్ పార్టీ పూనుకున్నదని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం చట్టసభల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేసే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అలవికాని హామీలి చ్చి తెలంగాణలో అధికారంలోకి వచ్చింది అని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక దిక్కుతోచని స్థితిలో రేవంత్ రెడ్డి మంత్రిమండలిని, పార్టీ ఎమ్మెల్యేలను, బీసీ సోదరులను వెంటబెట్టుకుని వచ్చి జంతర్ మంతర్ వద్ద డ్రామా చేస్తుండు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ధర్నాలు, డ్రామాతో ఏ మాత్రం లాభం లేదు, బీసీలకు ఒరిగేదేమీ ఉండదు అని పేర్కొన్నారు. రాజ్యాధికారంలో మా న్యాయమైన వాటా కోసం, హక్కుల సాధనకు ఇటువంటి ధర్నాలు,ఉద్యమాలు ఎన్నో చేశామన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తొలినాళ్లలోనే మహానేత కేసీఆర్ మహిళలు, బీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్స్ అమలు చేయా లంటూ అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపారు. బీసీల తో పాటు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందంటే, సముచిత గౌరవం దక్కిదంటే అది కేసీఆర్ సుపరిపాలనలోనే అని పేర్కొన్నారు. మోసపు మాటలు చెప్పి, బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా, ఉద్యోగ రంగాలలో 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేయడంలో చిత్తశుద్ధి ఉంటే రాహూల్ గాంధీ పార్లమెంటులో గళమెత్తాలి, కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచాలి. లోకసభ, రాజ్యసభల్లో కలిపి కాంగ్రెస్, ఇండియా కూటమికి 300 మందికి పైగా సభ్యులు ఉన్నారు, కేంద్రాన్ని ఒప్పించి బీసీ బిల్లు పెడితే బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతునిస్తుంది, రిజర్వేషన్స్‌కు చట్టబద్ధత లభిస్తుంది అని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.



# తెలంగాణ రాష్ట్ర సాధనే ఊపిరిగా బతికిన జయశంకర్‌సార్

### ఆయన సేవలను ఎప్పటికీ వెలకట్టలే: హరీశ్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 6 :** జీవితాంతం తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా, ఏకైక ఎజెండాగా బతికిన మహనీయుడు జయశంకర్ సార్ అని మాజీ మంత్రి హరీశ్‌రావు కొనియాడారు. ఆయన తెలంగాణ రాష్ట్ర సాధనకు చేసిన కృషి ఎప్పటికీ వెలకట్టలేమని పేర్కొన్నారు. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షకు ప్రతీక, తెలంగాణ ముద్దుబిడ్డ, సిద్ధాంత కర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. భవిష్యత్ తరాలకు జయశంకర్ స్ఫూర్తిని అందించాలనే ఉద్దేశంతో వారి జీవిత విశేషాలను పాఠ్యపుస్తకాల్లో మాజీ సీఎం కేసీఆర్ చేర్పించారని గుర్తుచేశారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ, భూపాలపల్లి జిల్లాలకు వారి పేరు పెట్టడంతో పాటు, ఏటా ఆయన జయంతి, వర్ధంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించేలా నిర్ణయించారని తెలిపారు. జయశంకర్ సార్.. ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని వారి మార్గంలో పయనించడమే వారికి మనమిచ్చే నిజమైన నివాళి అని హరీశ్‌రావు పేర్కొన్నారు.



### మహిళా ప్రతినిధి పట్ల పోలీసు చర్యలు బాధాకరం : హరీశ్‌రావు

కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు రోజురోజుకు దిగిజారిపోతున్నాయని, మొట్టమొదటి మహిళా హోంమంత్రి, సీనియర్ శాసన సభ్యురాలు అయిన సబితా ఇంద్రారెడ్డి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటూ మహిళా సభ్యురాలి పట్ల ఇంత కర్కశంగా, అవమానకరంగా వ్యవహరించడం సిగ్గుచేటని మండిపడ్డారు. రేషన్ కార్డుల విషయంలో ప్రభుత్వాన్ని నిలదీయడమే సబిత చేసిన తప్పా? మంత్రి సమక్షంలోనే కాంగ్రెస్ నాయకులు వీధి రౌడీలుగా బెదిరింపులకు పాల్పడుతుంటే అడ్డుకోవాల్సిన పోలీసులు వారితో కలిసి మహిళా ఎమ్మెల్యేపై దౌర్జన్యానికి పాల్పడడం దుర్మార్గమ న్నారు. సబితపై అనుచితంగా, అమర్యాదగా ప్రవర్తించిన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హోంమంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని కోరారు.

## అందాల పోటీలు పెట్టడం కాదు స్త్రీలను గౌరవించండి : మెతుకు ఆనంద్

**హైదరాబాద్, ఆగస్టు 6 :** అందాల పోటీలు పెట్టామని గొప్పలు చెప్పుకోవడం కాదు.. ముందు స్త్రీలు, మహిళా ప్రతినిధులను గౌరవించడం నేర్చుకోండి అని కాంగ్రెస్ నేతలను మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సూచించారు. మహేశ్వరం నియోజకవర్గం



పరిధిలోని బాలాపూర్‌లో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని ఉద్దేశపూర్వకంగా అవమానించడం విచారకరం అని ఆయన పేర్కొన్నారు. తన నియోజకవర్గ ప్రజలకు అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో కార్యక్రమంలో పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి.. ప్రోటోకాల్ పాటించకుండా ఓడిపోయిన కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని వేదిక మీద కూర్చోబెట్టి, తనకు చోటు లేకపోవడంతో అధికారిక కార్యక్రమంలో ఇదెక్కడి అన్యాయం అని ప్రశ్నించినందుకు గాను స్థానిక ఎమ్మెల్యే, అందులోనూ మహిళా ఎమ్మెల్యే అని కూడా చూడకుండా కాంగ్రెస్ కార్యకర్తలు సబితా ఇంద్రారెడ్డి మీదకు దూసుకురావడం కాంగ్రెస్ పార్టీలో మహిళలకు దక్కుతున్న గౌరవానికి నిదర్శనం అని మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. ఒక ఆడబిడ్డకు ఇంత అవమానం జరుగుతుంటే చూసి చూడనట్టు వ్యవహరించిన బాధ్యతరహిత మంత్రి శ్రీధర్ బాబు అని ఆనంద్ ధ్వజమెత్తారు. మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే అని చూడకుండా గతంలో కూడా నిండు సభలో కించపరిచారు. రాజ్యాంగపరమైన నియమాలకు అనుగుణంగా, సబితా ఇంద్రారెడ్డికి పూర్తి భద్రత కల్పించాల్సిన పోలీసులు కాంగ్రెస్ నాయకులకు భయపడి రక్షణ కల్పించలేకపోయారు. ప్రభుత్వం తరపున జరిగే రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సైతం గాంధీ భవన్‌లో జరిగే రాజకీయ కార్యక్రమంలాగా కాంగ్రెస్ పార్టీ మార్చేసిందని ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రజలను భ్రమ పెట్టేందుకే ఢిల్లీలో ధర్నాలు

### కాంగ్రెస్‌పై ఎమ్మెల్సీ కవిత ఘాటు విమర్శలు

**హైదరాబాద్, ఆగస్టు 6 :** బీసీల రిజర్వేషన్ల బిల్లు కోసం ప్రజలను భ్రమ పెట్టేందుకే ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా పేరుతో నాటకాలు ఆడుతుందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. సామాజిక తెలంగాణ అంటే ఢిల్లీకి వెళ్లి వట్టిగా ధర్నాలు చేయడం కాదని విమర్శలు చేశారు. బుధవారం తెలంగాణ జాగృతి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని కార్యాలయంలో జాగృతి జెండాను కవిత ఆవిష్కరించారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు ఇచ్చే 42 శాతం రిజర్వేషన్‌లో ముస్లింలు ఉండవద్దని ముందు నుంచి బండి సంజయ్ మాట్లాడుతునే ఉన్నారని చెప్పుకొచ్చారు. బీజేపీ బీసీలను మోసం చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ప్రతి ఒక్క పార్టీతో జై తెలంగాణ అనిపించామని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అని ఎందుకు అనడం లేదని ప్రశ్నించారు. బీసీల కోసం తాము హైదరాబాద్‌లో 72గంటల పాటు దీక్ష చేశామని ఉద్ఘాటించారు. కోర్టు నుంచి తమకు పర్మిషన్ రాలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో దొంగ దీక్షలు చేయడం కాదని, నిజమైన దీక్షలు చేయాలని హితవు పలికారు ఎమ్మెల్సీ కవిత. జాగృతిలోకి వచ్చేందుకు చాలామంది రెడీగా ఉన్నారని.. తమకు అన్నివర్గాల మద్దతు వస్తోందని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. బీసీల కోసం కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు చిత్తశుద్ధితో పని చేయటం లేదని మండిపడ్డారు. బీసీల కోసం జాగృతి కార్యచరణ సిద్ధం చేస్తుందని ప్రకటించారు. ముస్లిం రిజర్వేషన్లపై బండి సంజయ్ మాట్లాడకపోతేనే విచిత్రమని ఎద్దేవా చేశారు. బీసీ రిజర్వేషన్‌లపై కాంగ్రెస్ ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని, అన్ని పార్టీల నాయకులకు



లేఖలు రాయాలని సూచించారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ తీసుకొని, అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకొని వెళ్లాలనీ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ చెప్పినట్లుగా, వారి బాటలో తెలంగాణ జాగృతి ముందుకు వెళ్లిందని ఉద్ఘాటించారు. జయశంకర్ సార్ ఆలోచనలను తూచా తప్పకుండా పాటించామని చెప్పుకొచ్చారు. తెలంగాణ చూడకుండానే జయ శంకర్ సార్ దూరం అయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. జయ శంకర్ సార్ జయంతి సందర్భంగా జాగృతి ఫౌండేషన్ డే జరుపుకుంటున్నామని తెలిపారు. సామాజిక తెలంగాణ కోసం పాటుపడాలని జయశంకర్ సార్ అనేక సార్లు చెప్పారని గుర్తుచేసుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్నివర్గాల వారికి సమన్యాయం జరగాలని జయశంకర్ సార్ చెప్పే వారని పేర్కొన్నారు.

## 75 శాతం సబ్సిడీతో పశుగ్రాస గడ్డి విత్తనాలు

### వికారాబాద్ జిల్లా పశువైద్యాధికారి సదానందం



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** పాడి రైతులు తమ భూములలో పశుగ్రాసం సాగుచేయడం కోసం పశుసంవర్ధక శాఖ ద్వారా 75 శాతం సబ్సిడీ పై మేలుజాతి హైబ్రీడ్ గడ్డి విత్తనాలు జిల్లాలోని అన్ని పశు వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని జిల్లా పశు వైద్యాధికారి సదానందం ఒక ప్రకటనలో తెలియజేశారు. 5 కేజీల మినీకిట్స్ పూర్తి ధర రూ.500 కాగా సబ్సిడీ రూ.375 పోను రైతులు చెల్లించవలసిన ధర రూ.125 పశువుల మేత కోసం పశుగ్రాసభూములు తక్కువ అయిన ఈ రోజులలో పాడి రైతులు తనకున్న కొద్దిపాటి భూమిలోనే సంవత్సరం పొడుగునా గడ్డి అందుబాటులో ఉంచుకొని అదికంగా గడ్డి ఉత్పత్తి పొంది అదికగా పాలు ఉత్పత్తి చేసుకొని రైతులు ఆర్థికంగా ఆరోగ్యంగా లాభాలు పొందవచ్చని తెలిపారు.



## కలెక్టర్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘనంగా నివాళులు

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** తెలంగాణా సిద్దాంత కర్తగా పేరు పొందిన ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరు పాటించాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సుదీర్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశము హాలు నందు ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి జిల్లాఅదనపు కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి లతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయ శంకర్ 91 వ జయంతి వేడుకలు పురష్కరించుకొని వారి యొక్క సేవలను కొనియాడారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ బాషలలో మంచి ప్రావీణ్యం ఉన్న జయశంకర్ తెలంగాణా ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. తెలంగాణా ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి అని , తెలంగాణా ఉద్యమ సిదంతా కర్త అని వారి ఉద్యమ స్పూర్తిని, సేవలను కొనియాడారు. జయశంకర్ కలలుగన్న తెలంగాణ మనకు సిద్ధించిందని ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు తూచ తప్పకుండా పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అబివృద్ది అధికారి ఉపేందర్, డి ఆర్ డి ఎ శ్రీనివాస్ , జిల్లా అధికారులు , కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టీఎంజేఎఫ్ మండల అధ్యక్షునిగా మేడి శ్రీనివాస్



**ఆత్మకూర్( ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆత్మకూర్ (ఎం) మండల కేంద్రంలో, బుధవారం నూతన తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరం,మండల కమిటీని రాష్ట్ర నాయకులు మచ్చ రమేష్ ఆధ్వర్యంలో, టీ.ఎం.జె.ఎఫ్ మండల అధ్యక్షుడిగా మేడి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా వస్తువుల నరేష్,ప్రధాన కార్యదర్శిగా మేడి స్వామి,కోశాధికారిగా మేడి అంజయ్య, కార్యదర్శిగా సంఘపాక సతీష్, సభ్యులు గడ్డం నాగరాజు లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మేడి శ్రీనివాస్ మాట్లాడుతూ,ఆగస్టు 12వ తేదీన రవీంద్రభారతిలో జరగబోయే టీఎంజెఎఫ్ రెండవ మహాసభలకు టీఎంజెఎఫ్ విలేకరులు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని అన్నారు.



## టీఎంజేఎఫ్ మండల అధ్యక్షునిగా మేడి శ్రీనివాస్

**ఆత్మకూర్( ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆత్మకూర్ (ఎం) మండల కేంద్రంలో,బుధవారం నూతన తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరం,మండల కమిటీని రాష్ట్ర నాయకులు మచ్చ రమేష్ ఆధ్వర్యంలో, టీ.ఎం.జె.ఎఫ్ మండల అధ్యక్షుడిగా మేడి శ్రీనివాస్ ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా వస్తువుల నరేష్,ప్రధాన కార్యదర్శిగా మేడి స్వామి,కోశాధికారిగా మేడి అంజయ్య,కార్యదర్శిగా సంఘపాక సతీష్,సభ్యులు గడ్డం నాగరాజు లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మేడి శ్రీనివాస్ మాట్లాడుతూ,ఆగస్టు 12వ తేదీన రవీంద్రభారతిలో జరగబోయే టీఎంజెఎఫ్ రెండవ మహాసభలకు టీఎంజెఎఫ్ విలేకరులు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని అన్నారు.



## ఇండస్ట్రియల్‌లలో తనిఖీలు చేసిన జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** రైతులకు యూరియా కొరత ఏర్పడకూడదని ఎవరైనా ఇండస్ట్రియల్ కు అక్రమంగా తరలిస్తున్నారా లేదా అని వికారాబాద్ పరిధిలోని ఇండస్ట్రియల్ లను బుధవారం వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం తనిఖీ చేశారు. ఎవరైనా అక్రమంగా యూరియాను వాడుతున్నారా లేదా అని పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ఎవరైనా అక్రమంగా ఇండస్ట్రియల్ లకు అమ్ముకున్నారా లేదా అని తనిఖీలు నిర్వహించారు. తనికిలో భాగంగా ఏ ఇండస్ట్రియల్ లో కూడా యూరియా లేదన్నారు. తనిఖీ భాగంగా ఏ డి ఏ వెంకటేశం, ఎం ఏ ఓ ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు.

## బూతు స్థాయి అసిస్టెంట్ల నియామకానికి

# ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

### వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లాలో పోలింగ్ కేంద్రాలకు ప్రతి పార్టీ నుండి బూతు స్థాయి అసిస్టెంట్లు నియామకానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సుదీర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారము అదనపు కలెక్టర్ ఛాంబర్ లో పోలింగ్ స్టేషన్ ల హేతుబద్ధీకరణకు సన్నాహాలు, కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటుతో పాటు భవనాల గుర్తింపు తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీలనుద్దేశించి అదనపు కలెక్టర్ సుదీర్ మాట్లాడుతూ, బూతు స్థాయి అసిస్టెంట్లు ప్రాధాన్యత ఎంతో అవసరమని, వారి నియామకానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పోలింగ్ కేంద్రంలో 1200 మంది కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉండకూడదనే నిబంధనల మేరకు ఎన్నికల కమిషన్ అనుమతి మేరకు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయవలసి ఉంటుందని ఆయన తెలిపారు. జిల్లాలో 284 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, బూత్ స్థాయి అసిస్టెంట్లను ఏర్పాటు చేసి ఎన్నికల కమిషన్ కు అప్లోడ్ చేసి వారి పర్మిషన్ తెసుకోవలసి ఉంటుందని అన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ లో బి ఎల్ ఓ లు , బి ఎల్ ఎ లు సమన్వయంతో పని చేస్తూ ఓటరు జాబితా లో పేర్లు మార్పులు చేర్పులు చేయాల్సి ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో వికారాబాద్ తహసిల్దార్ లక్ష్మీనారాయణ, డి టి అనిత, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జిల్లాలోని ప్రోగ్రాం అధికారులు, వైద్య అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం ఐ డి ఓ సి కాంప్లెక్స్ లోని మీటింగ్ హాల్ నందు జిల్లాలోని అందరూ ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే లలితా దేవి జిల్లాలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలును వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న జాగ్రత్తల గురించి తగు సూచనలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రసవాలు నిర్వహించాలని, వీలైనంత మీరేకు ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరిగే విధంగా ప్రజలలో అవగాహన కలిగించాలని అందుకు ప్రతి వైద్యాధికారి, ఎం ఎల్ హెచ్ పి లు బాధ్యత వహించాలని సూచించారు. అనంతరం వ్యాధి నిరోధక టీకాలు, అసంక్రమిత వ్యాధులు, టీబీ నియంత్రణ కార్య క్రమల అమలు గురించి సమీక్షించడం జరిగినది. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు జాతీయ నాణ్యత ప్రమాణాల ప్రకారం నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జరుగుతున్న వివిధ రిపేర్ ల గురించి నాణ్యంగా పనులు జరిగే విధంగా చూడాలని సూచించారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న 87 ఆరోగ్య ఉప కేంద్రాలలో పనులు నాణ్యంగా జరిగే విధంగా చూడాలని, మూడు నెలల్లో పనులు పూర్తయ్యే విధంగా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బంది ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టం ద్వారా ప్రతిరోజు హాజరు నమోదు చేయాలని ఆదేశించారు.

జిల్లాలో శిశు మరణాలు, మాతృ మరణాలకు సంబంధించి ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. ఈనెల ఆగస్టు 11న నిర్వహించే నులిపురుగుల నివారణ కార్యక్రమం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏమాత్రం అజాగ్రత్త వహించకుండా నిర్దేశిత లక్ష్యాల మేరకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ హర్ష చౌదరి, అడిషనల్ కలెక్టర్ సుధీర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే లలితాదేవి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్, డాక్టర్ పవిత్ర, వైద్యాధికారులు, ఎం ఎల్ హెచ్ పి లు పాల్గొన్నారు.

## ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి



**వలిగొండ రాజముద్ర న్యూస్:** ప్రొఫెసర్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి పురస్కరించుకొని వలిగొండ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆచార్య జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో జలంధర్ రెడ్డి జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షకు ప్రతీక, తెలంగాణ మట్టిగడ్డ తీర్చిదిద్దిన ముద్దుబిడ్డ, సైద్ధాంతిక పునాదిని ఏర్పరిచిన గొప్ప దార్శనికుడు.. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్, ఆయన జీవితం తెలంగాణకే ం, తన జీవితాంతం రాష్ట్ర సాధనే లక్ష్యంగా, ఏకైక ఎజెండాగా బతికిన మహనీయుడు జయశంకర్ సార్ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కేదారేశ్వర ఏపీవో పరశురాం పంచాయతీ రాజ్ ఏఈ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలేరులో వికలాంగుల చేయూత పెన్షన్‌దారుల మహాసభను విజయవంతం చేయాలి

- ఎమ్ ఆర్ పి ఎస్ జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ
- ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ



**ఆలేరు, రాజముద్ర న్యూస్:** వికలాంగుల పెన్షన్ రూ 6 వేలకు మరియు వృద్దులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అన్ని రకాల చేయూత పెన్షన్లు రూ 4 వేలకు పెంచాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా ఆగస్టు 13 వ తేదీన ఆలేరు నియోజకవర్గం కేంద్రంలో చేయూత పెన్షన్ దారుల మహాసభను నిర్వహిస్తున్నామని ముఖ్య అతిథిగా పెన్షన్ దారుల ఆశాజ్యోతి పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ అన్నారు. ఆలేరు నియోజకవర్గం కేంద్రం లోని రహదారి బంగ్లా లో నియోజక వర్గ ఎమ్ ఆర్ పి ఎస్, ఎం ఎస్ పి, వి హెచ్ పి ఎస్, కార్యకర్తల సమావేశం ఎమ్ ఎస్ పి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్ ఆర్ పి ఎస్ జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ మాట్లాడుతూ “ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వికలాంగుల పెన్షన్ రూ 6 వేలకు పెంచి ఇస్తున్నాడు. కానీ తెలంగాణలో రూ 6 వేలు ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగులను మోసం చేశాడని అన్నారు. 2023 ఎన్నికల సమయంలో వికలాంగుల పెన్షన్ 6 వేలు, మిగితా చేయూత పెన్షన్ దారుల పెన్షన్ రూ 4 వేలకు పెంచుతామని రేవంత్ రెడ్డి బహిరంగంగా హామీ ఇచ్చారు. ఈ నెల ఓటు వేయండి, వచ్చే నెల పెరిగే పెన్షన్ తీసుకొండని మాట్లాడిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టి 20 నెలలు దాటినా ఒక్క రూపాయి కూడా పెంచలేదని అన్నారు. ఇది ఘోరమైన మోసం అని అన్నారు. ఈ మోసం గురించి ప్రతిపక్షాలు కూడా మాట్లాడకుండా చేయూత పెన్షన్ దారులకు అన్యాయం చేస్తున్నాయని అన్నారు. కాబట్టే 50 లక్షల మంది పెన్షన్ దారుల పక్షాన మంద కృష్ణ మాదిగ పోరాటానికి శ్రీకారం చుట్టారని అన్నారు. అందులో భాగంగా తెలంగాణ నలుమూల తిరుగుతూ 13 వ తేదీన ఆలేరు కు వస్తున్నారని అన్నారు. ఆలేరు నియోజక వర్గ పరిధిలో ఉన్న అన్ని రకాల చేయూత పెన్షన్ దారులు మహాసభకు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్ ఆర్ పి ఎస్ జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ, జాతీయ నాయకులు కందుల శంకర్ మాదిగ, ఎమ్ ఎస్ పి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎమ్ ఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ, వి ఎచ్ పి యస్ జిల్లా అధ్యక్షులు ధరణి కోట నర్సింహ్మ, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి సందేల శ్రీనివాస్ మాదిగ, మార్కెట్ డైరెక్టర్ చిలుకు కిష్టయ్య, వివిధ మండలాల నుండి ఎమ్మార్పియస్, ఎంఎస్పీ, వి ఎచ్ పి యస్ నాయకులు సిద్దా రెడ్డి, లోడి ధనుంజయ్య గౌడ్, గుజ్జ అశోక్, బండ జహంగీర్, సింగారం రమేష్, సిలువేరు విజయ్, సందేపల్లి రామ్ నర్సయ్య మాదిగ, కంతి దిలీప్, కంతి శ్రీనివాస్, జెరిపోతుల కరుణాకర్, ఆకారపు లక్ష్మీ నారాయణ, ఆదేపు పాండు, అఖిల్, పర్రె రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## వంగర ఆసుపత్రి సమస్యలు పరిష్కరిస్తాం

- ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెంచాలి
- జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య

**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్ :** వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హనుమకొండ జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య తెలిపారు. భీమదేవరపల్లి మండలం వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని వ్యాధి నిరోధక టీకాలు, ఎన్ సి డి స్క్రీనింగ్, ఫీవర్ సర్వే, డ్రై డే, తల్లిపాల ప్రాముఖ్యత కార్యక్రమాల గురించి సిబ్బంది వ్యవహరిస్తున్న తీరును పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా చూడాలని ఆశా కార్యకర్తలకు సూచించారు.ఇన్ పేషెంట్, అవుట్ పేషంట్, ఫార్మసీ, లేబరు రూమ్,వార్డులను తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనీ సమస్యలను సిబ్బంది డిఎంహెచ్వో దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అప్పయ్య మాట్లాడుతూ బీపీ ,షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా సరిపడా మందులను ఇవ్వాలన్నారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించి ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగించాలని అన్నారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెహమాన్, డాక్టర్ రుబీనా, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ జ్యోతి, హెడ్ నర్స్ అరుణ, స్టాఫ్ నర్స్, సిస్టర్లు, ఆశా కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## బాలానగర్ పీఎస్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా సక్రమ్



**కూకట్పల్లి, రాజముద్ర న్యూస్:** బాలానగర్ పోలీస్ స్టేషన్‌కు నూతన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా బి. సక్రమ్ బాధ్యతలు స్వీకరించారు. 2012 బ్యాచ్‌కు చెందిన పోలీసు అధికారి అయిన సక్రమ్, గతంలో ఈ స్థానంలో ఉన్న డిఐ నాగిరెడ్డి సీఐడీకి బదిలీ కావడంతో ఈ నియామకం జరిగింది. బుధవారం సక్రమ్ తన విధులను ప్రారంభించారు. సక్రామ్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా స్టేషన్‌లోని నేరాల నివారణ కార్యకలాపాలను, కేసుల దర్యాప్తును పర్యవేక్షిస్తారు. పోలీసు సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ శాంతిభద్రతలను కాపాడటమే తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్దకాలంగా పోలీసు శాఖలో పనిచేస్తున్న సక్రమ్, ఇంతకుముందు నర్సింగ్గి, కేపీహెచ్‌బీ, చౌదరిగూడెం, రాయదుర్గం వంటి కీలక పోలీస్ స్టేషన్లలో సబ్-ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. తన సుదీర్ఘ అనుభవంతో బాలానగర్ పరిధిలో నేరాలను అరికట్టి, ప్రజలకు మెరుగైన భద్రత కల్పించేందుకు కృషి చేస్తానని సక్రామ్ తెలిపారు.



## కూచిపూడి నాట్యకళ గురువు ప్రణవి తుమ్మటి నీ ఆమె శిష్యులను సన్మానించిన ఎమ్మెల్సీ కవిత

**కుత్బుల్లాపూర్, రాజముద్ర న్యూస్:** జగదిరిగుట్టలో మానస స్కూల్ ఆఫ్ డాన్స్ అకాడమీ కుచిపూడి నాట్యకళలో తన అపార ప్రతిభను చాటిన గురువు ప్రణవి తుమ్మటి, ఆమె శిష్యులను ఎమ్మెల్సీ కవిత తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కేరళ రాష్ట్రంలోఏ కాలికట్ లో నిర్వహించిన అఖిల భారత నృత్య పోటీలో బహుమతులు గెలుచుకుని రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన గురువు ప్రణవి తుమ్మటి, ఆమె శిష్యులు సీనియర్ విభాగం: హర్షిత 2వ బహుమతి, జూనియర్ విభాగం: శ్రీ విద్య 2వ బహుమతి, హిమవర్షిత 2వ బహుమతి, సబ్ జూనియర్ విభాగం: 1వ బహుమతి, విజేత: సహస్ర, ప్రదీక్ష, 2వ బహుమతి సాధించారు. ఈ విద్యార్థులందరినీ అభినందించారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. కూచిపూడి నాట్యకళ లో విజయలు సాధించినందుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపీ తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.



## జయశంకర్ జయంతి వేడుకలు

**ఆత్మకూర్( ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర స్వాప్నికుడు, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాములు నాయక్, కార్యాలయ సిబ్బంది, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## నూతన ఎస్సైని సన్మానించిన జర్నలిస్టులు

**గుండాల రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో స్థానిక పోలీస్ స్టేషన్ కు నూతనంగా వచ్చినటువంటి సబ్ ఇన్స్పెక్టర్ తేజంరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.



# నేను మోదీకి ఫోన్ చేస్తాను

### ట్రంప్‌నకు బ్రెజిల్ అధ్యక్షుడి సమాధానం

**బ్రెజిల్ :** 'సమస్యల పరిష్కారంపై చర్చల కోసం ఎప్పుడైనా కాల్ చేయవచ్చు' అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన ఆఫర్‌ను బ్రెజిల్ అధ్యక్షుడు లుల డిసిల్వా తిరస్కరించారు. ఆయనకు తప్ప మోదీ, జిన్‌పింగ్ సహా ఎవరికైనా కాల్ చేస్తానని చెప్పారు. బ్రెజిల్‌లోని బ్రసిలియాలో డిసిల్వా మాట్లాడుతూ "మేము మా ప్రయోజనాలను కాపాడుకొనేందుకు ప్రపంచ వాణిజ్య సంస్థ మొదలు అన్ని ఆప్షన్లను వినియోగిస్తాము. విదేశీ వాణిజ్యాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకొంది. అమెరికాలో కొత్త ప్రభుత్వం రాగానే.. దేశీయ కంపెనీలకు కొత్త అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నాం. నేను అమెరికా అధ్యక్షుడికి ఫోన్ చేయను. ఆయన చర్చలకు సిద్ధంగా లేరు. నేను అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు, ప్రధాని మోదీకి కాల్ చేస్తాను. పుతిన్‌కు కూడా కాల్ చేయను. ఎందుకంటే ఆయన మాతో ప్రయాణించడం లేదు కాబట్టి. దీంతోపాటు ఇతర ప్రపంచ నేతలతో కూడా ఫోన్‌లో మాట్లాడతాను" అని తేల్చిచెప్పారు. కాగా, తన మిత్రుడు, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైరో బోల్సెనారోపై దర్యాప్తు చేపట్టడాన్ని ట్రంప్ తప్పు పట్టారు. బ్రెజిల్‌పై అత్యధికంగా 50శాతం పన్ను టారిఫ్ విధించారు. దీంతో వాషింగ్టన్- రియో డి జనేరియోల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ ఏడాది బ్రెజిల్‌లో కాప్30 సదస్సు జరగనుంది. విభేదాలను పక్కనపెట్టి ఈ కార్యక్రమానికి ట్రంప్‌ను ఆహ్వానిస్తానని డిసిల్వా చెప్పారు. కేవలం వాతావరణ మార్పులపై ఆయన అభిప్రాయం తెలుసుకోవడానికి ఇలా చేస్తానన్నారు. ఆయన రావాలనుకోకపోతే గైర్హాజరవుతారన్నారు. బ్రెజిల్ చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.



# చైనా పర్యటనకు ప్రధాని మోదీ షెడ్యూల్ ఖరారు..

### 'గల్వాన్' ఘటన తర్వాత తొలిసారి

**న్యూఢిల్లీ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ త్వరలో చైనాలో పర్యటించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. తియాంజిన్ వేదికగా ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సదస్సులో ఆయన పాల్గొననున్నారు. గల్వాన్ ఘటన తర్వాత ప్రధాని మోదీ చైనాలో పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో మోదీ ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది కజాన్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అయిన విషయం తెలిసిందే. తొలిసారిగా 2015లో బీజింగ్‌కు వెళ్లిన భారత ప్రధాని.. ఇప్పటివరకు ఐదుసార్లు ఆ దేశంలో పర్యటించారు. 2019లో చివరిసారిగా చైనాలో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరిగ్గా ఇటీవలే కొంత పురోగతి కనిపిస్తోంది. చైనాలో ఈ ఏడాది జూన్‌లో జరిగిన 'షాంఘై సహకార సంస్థ' సభ్యదేశాల రక్షణ మంత్రుల సదస్సులో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదం, పహల్గాం ముష్కర దాడులను ప్రస్తావించకపోవడంపై తీవ్రంగా పరిగణించిన భారత్.. ఉమ్మడి ప్రకటనపై సంతకం చేసేందుకు నిరాకరించింది. దీంతో ఎలాంటి ఉమ్మడి ప్రకటన లేకుండానే నాటి చర్చలు ముగిశాయి. అనంతరం జులైలో జరిగిన విదేశాంగ మంత్రుల సదస్సులో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పాల్గొన్న సంగతి తెలిసిందే. మరోవైపు భారత్‌పై సుంకాలు విధించిన ట్రంప్.. రష్యాతో ముడిచమురు కొనుగోలును తీవ్రంగా వ్యతిరేకిన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని విధిస్తామంటూ హెచ్చరిస్తు న్నారు. ఇదే సమయంలో రష్యా మాత్రం భారత్‌కు మద్దుతుగా నిలుస్తోంది. ఇదే సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ భేటీ అయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ తాజా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

# భారత్ ఎవరికీ తలవంచదు..

### ట్రంప్ టారిఫ్‌లపై హర్ష్ గోయెంకా



**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై మరో 25 శాతం మేర సుంకాలు విధించడంపై ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్‌పీజీ గ్రూప్ ఛైర్మన్ హర్ష్ గోయెంకా స్పందించారు. భారత్ ఎవరికీ తలవంచదని పేర్కొంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "మీరు మా ఎగుమతులపై సుంకాలు విధించవచ్చేమో గానీ.. మా సార్వభౌమాధికారంపై కాదు. మీ ఆదేశాల ఒత్తిడి కంటే ఇంధన భద్రతే ముఖ్యం. డిస్కౌంట్లనే మేం ఎంచుకుంటాం. మీరు సుంకాలు పెంచండి.. మేం మా సంకల్పాన్ని పెంచుకుంటాం. మెరుగైన ప్రత్యామ్నాయాలు కనుగొని స్వావలంబనను సాధిస్తాం. భారత్ ఎవరికీ తలవంచదు" అని పేర్కొన్నారు.

#### పరిణామాలేంటో ట్రంప్‌కు తెలియట్లేదు: శరద్ కోహ్లీ

భారత్‌పై అదనంగా 25 శాతం సుంకాలు విధిస్తూ అమెరికా తీసుకున్న నిర్ణయం స్వీయ విధ్వంసకరమని ఆర్థికరంగ నిపుణులు శరద్ కోహ్లీ అన్నారు. దాని వల్ల జరిగే పరిణామాలేంటో ట్రంప్‌నకు తెలియదన్నారు. 'బలమైన మిత్రదేశంతో ఆయన శత్రుత్వాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్యం కలిగిన దేశం. భారత్, అమెరికా సహజ మిత్రులు. అమెరికా ప్రజలు తమ సాంకేతిక పరిజ్ఞానం విషయంలో, వైద్యరంగానికి సంబంధించినంతవరకు భారత్‌పైనే ఆధారపడతారనే వాస్తవాన్ని ట్రంప్ మరిచిపోతున్నట్లున్నారని భావిస్తున్నా. మిగతా ప్రపంచం నుంచి తనను తాను దూరం చేసుకుంటున్నారు" అని విశ్లేషించారు.

# భారత్‌ను దూరం చేసుకోవద్దు

### ట్రంప్ సుంకాల పెంపు వ్యాఖ్యలపై నిక్కీ హేలీ ఆసక్తికర వ్యాఖ్యలు



భారత్‌లాంటి బలమైన మిత్ర దేశంతో అమెరికా తన సంబంధాలను దెబ్బతీసుకోకూడదని భారత సంతతికి చెందిన రిపబ్లికన్ నాయకురాలు నిక్కీ హేలీ పేర్కొన్నారు. భారత్ తమకు మంచి భాగస్వామి కాదంటూ, దానిపై సుంకాల భారాన్ని గణనీయంగా పెంచుతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నిక్కీ హేలీ ఇరుదేశాల సంబంధాలపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయకూడదు కానీ, చైనా చేయొచ్చా అని ఆమె ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. రష్యా నుంచి చైనా అత్యధికంగా ఇంధనం కొనుగోలు చేస్తుందని తెలిపారు. అలాంటి దేశానికి మాత్రం సుంకాల నుంచి 90 రోజులు మినహాయింపు ఇచ్చారని ట్రంప్ పరిపాలనపై పరోక్షంగా విమర్శలు చేశారు. ఈసందర్భంగా చైనాకు ఇలాంటి అనుమతులు ఇస్తూ.. భారత్ లాంటి బలమైన మిత్ర దేశంతో సంబంధాలను దూరం చేసుకోవద్దని సూచించారు. దక్షిణ కరోలినా మాజీ గవర్నర్ అయిన హేలీ.. ట్రంప్ మొదటిసారి అధికారంలో ఉన్నప్పుడు ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారిగా ఉన్నారు. 2024లో అధ్యక్ష అభ్యర్థి రేసులో పోటీ చేసిన ఆమె.. ఆ తర్వాత ట్రంప్‌నకు మద్దతు తెలిపారు.

ఇదిలాఉండగా.. నిన్న, మొన్నటివరకు భారత్‌ను తమ మిత్రదేశంగా పేర్కొన్న ట్రంప్, తాజాగా మాట మార్చేశారు. ఆ దేశం తమకు మంచి భాగస్వామి కాదని వ్యాఖ్యానించారు. రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నారనే కారణంతో 25శాతం సుంకంతో పాటు పెనాల్టీలు విధిస్తున్నట్లు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ టారిఫ్‌లను గణనీయంగా పెంచుతానంటూ హెచ్చరికలకు దిగారు. మాస్కో నుంచి ఇంధనం కొనుగోలు చేయడం వల్ల వారు యుద్ధం చేయడానికి సహకరించినట్లవుతుందని, అందుకే తాను సంతోషంగా లేనని వ్యాఖ్యానించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో రష్యా భారత్‌కు మద్దతుగా నిలిచింది. తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు వీలుగా వాణిజ్య, ఆర్థిక భాగస్వాములను ఎంచుకునే హక్కు సార్వభౌమ దేశాలకు ఉంటుందని స్పష్టం చేసింది.

### సరైన సేవలు అందించకపోతే..

# టోల్ వసూలు కుదరదు : కేరళ హైకోర్టు




**కేరళ :** రోడ్ల విషయంలో ప్రయాణికులకు సరైన సేవలు అందించకపోతే టోల్ రుసుం వసూలు చేయలేరని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, సంబంధిత ఏజెన్సీలకు కేరళ హైకోర్టు స్పష్టం చేసింది. ఎన్‌హెచ్-544లో ఎడప్పల్లి-మన్నుతి మార్గంలో టోల్ వసూళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఒకవైపు ఫ్లైఓవర్లు, డ్రైనేజీల వంటి నిర్మాణ పనులు.. మరోవైపు సర్వీస్ రోడ్డు సరిగా లేకపోవడంతో హైవేపై ట్రాఫిక్ ఏర్పడుతోందని.. ఇలాంటి పరిస్థితుల్లో టోల్ వసూలు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన రిట్ పిటిషన్లపై ఈమేరకు తీర్పు ఇచ్చింది. "హైవేను ఉపయోగించుకున్నందుకు టోల్ చెల్లించాల్సిన బాధ్యత ప్రయాణికులపై ఉంది. అదేవిధంగా.. రోడ్డుపై తమ వల్ల ఎటువంటి అవరోధాలు లేకుండా ట్రాఫిక్ సజావుగా సాగేలా చూసుకోవాల్సిన బాధ్యత ఎన్‌హెచ్‌ఏఐ, సంబంధిత ఏజెన్సీలపై ఉంది. ప్రజలకు, ఎన్‌హెచ్‌ఏఐకి మధ్య పరస్పర విశ్వాసంతో కూడిన సంబంధం ఉంటుంది. అది ఉల్లంఘనకు గురైన క్షణంలో.. టోల్ వసూలు చేసే హక్కును ప్రజలపై బలవంతంగా రుద్దలేం" అని హైకోర్టు పేర్కొంది. ఈ కేసులో ప్రజాప్రయోజనాలను ఎన్‌హెచ్‌ఏఐ విస్మరించిందని, వారి ఫిర్యాదులను పట్టించుకోలేదని గుర్తుచేసింది. టోల్ వసూలు అనేది కాంట్రాక్టుకు సంబంధించిన విషయమని, దానిని అడ్డుకుంటే సంబంధిత చట్టాల కింద తీవ్రమైన పరిణామాలకు దారితీస్తుందని ఎన్‌హెచ్‌ఏఐ చేసిన వాదనలను హైకోర్టు తోసిపుచ్చింది. ప్రభుత్వం, ప్రైవేటు సంస్థల మధ్య ఒప్పందాలు.. ప్రజాప్రయోజనాలను మించినవి కావని పేర్కొంది. సరైన సేవలు అందించకపోతే.. కేవలం కాంట్రాక్టు పేరిట టోల్ చెల్లించమని బలవంతం చేయలేరని స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే టోల్ వసూళ్లను వెంటనే నాలుగు వారాల పాటు నిలిపివేయాలని ఆదేశించింది. ఈ వ్యవధిలో ప్రజా ఫిర్యాదులను పరిష్కరించేందుకు తగిన నిర్ణయాలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది.

# చైనాలో వైరస్‌పై యుద్ధానికి ఏనుగు దోమలు



**చైనా :** చైనాలోని దక్షిణ ప్రాంతంలోని గ్వాంగ్‌డాంగ్‌లో ప్రావిన్స్ ఫోషన్ నగరంలో ప్రభుత్వం వైరస్‌పై యుద్ధం ప్రకటించింది. ఇందుకోసం కొవిడ్ తరహాలో ఆంక్షలను అమల్లోకి తీసుకొచ్చింది. ఇక్కడ నెల వ్యవధిలో 7,000 గన్యా కేసులు నమోదయ్యాయి. గత 20 ఏళ్లలో చైనాలో ఇంత తీవ్రస్థాయిలో రావడం ఇదే తొలిసారి. 2008లో ఈ స్థాయిలో వైరస్ వ్యాపించింది. దీంతో సైన్యాన్ని రంగంలోకి దింపి.. రక్షణచర్యలు చేపట్టింది. వీధులను ఫాగింగ్‌తో పూర్తిగా డిస్ ఇన్‌ఫెక్ట్ చేస్తోంది. దోమలు పెరిగే ప్రదేశాలను గుర్తించేందుకు ప్రత్యేక డ్రోన్లను ప్రయోగిస్తోంది. ఇక పరిశోధకులు భారీ ఎలిఫెంట్ దోమలను కూడా రంగంలోకి దించారు. వీటితోపాటు దోమలను తినే ప్రత్యేక రకమైన 5,000 చేపలను కాల్వల్లోకి వదిలారు. వీటి అసలు పేరు 'టెక్సోరెంకైటిస్'. 'ఎలిఫెంట్ మస్కిటో' అని కూడా అంటారు. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద దోమ జాతి ఇదే. అమెరికా, ఆస్ట్రేలియా, ఆసియా దేశాల్లో ఎక్కువగా జీవిస్తుంటాయి. వీటిల్లో దాదాపు 90 రకాలు ఉన్నాయి. వీటికి ప్రధానంగా అడవులే ఆవాసం. 18 మిల్లీమీటర్ల నుంచి 24 మిల్లీమీటర్ల వరకు పెరుగుతాయి. వీటిలో చాలారకాల వల్ల మనుషులకు ప్రమాదం లేదు. సాధారణంగా ఆడదోమలు మన రక్తాన్ని తాగుతాయి. కానీ చాలారకాల ఎలిఫెంట్ మస్కిటోలు ఆడవైనా సరే మొక్కలు, చెట్ల రసాలను పీల్చే బతుకుతాయి. వీటికి కార్బోహైడ్రేట్స్ ఉన్న ఆహారం అవసరం. రాత్రి వేళల్లో పడుకొంటాయి. వీటి ఆడదోమలు నీటి ఉపరితలం మీద గుడ్లు పెడతాయి. సాధారణ దోమలు కూడా ఇలాంటి ప్రదేశాల్లోనే సంతానోత్పత్తి చేస్తాయి. ఎలిఫెంట్ మస్కిటోల గుడ్ల నుంచి కేవలం 40 నుంచి 60 గంటల్లోనే లార్వాలు బయటకు వస్తాయి. అవి సమీపంలోని సాధారణ దోమల గుడ్లు తిని పెరుగుతాయి. ఒక్క లార్వా కనీసం 100 దోమల గుడ్లను తింటుంది. దీంతో ఇతర దోమల సంతానం పెరగదు. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 2,40,000 గన్యా కేసులు నమోదు కాగా.. వీటిల్లో 90 మరణాలు సంభవించినట్లు యూరోపియన్ సెంటర్ ఫర్ డిసీజ్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దక్షిణ అమెరికా దేశాల్లో అత్యధికంగా వ్యాపించింది.

# ఫ్రాన్స్‌లో భారీ కార్చిచ్చు

### 12వేల హెక్టార్ల అటవీ ప్రాంతం దగ్ధం





**ఫ్రాన్స్ :** దక్షిణ ఫ్రాన్స్‌లో భారీ కార్చిచ్చు సంభవించింది. మంగళవారం ఫ్రాన్స్‌లోని ఆడ్ డిపార్ట్‌మెంట్ ప్రాంతంలో ఎగసిపడిన అగ్నికీలల్లో ఇప్పటి వరకు దాదాపు 12,000 హెక్టార్ల విస్తీర్ణంలో చెట్లు కాలిపోయాయని అధికారులు పేర్కొన్నారు. కిలో మీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు సైతం భారీగా పొగ వ్యాపించిందని.. ఈ కార్చిచ్చు కారణంగా సమీపంలోని 25 ఇళ్లు పూర్తిగా కాలిపోయాయని తెలిపారు. మంటలను అదుపు చేయడానికి 1,800 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. దీనికి వైమానిక దళాల సహాయం కూడా తీసుకుంటున్నారు. గాలి నాణ్యత క్షీణిస్తుండటంతో అధికారులు పలు సూచనలు జారీ చేశారు. ఇప్పటికే ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారని తెలిపారు. ఆడ్ డిపార్ట్‌మెంట్ ప్రాంతానికి దగ్గరలో ఉన్న ఓ గ్రామం మొత్తాన్ని ఖాళీ చేయించి నట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. ప్రభావం ఎక్కువగా ఉండే సమీప ప్రాంతాల్లోని వారిని తరలిస్తున్నామన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ కార్చిచ్చు వ్యాప్తి ఆగట్లేదని.. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవని తెలిపారు. మంటల నేపథ్యంలో చుట్టుపక్కల రహదారులను మూసివేయడంతో రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది.



# పుతిన్‌తో ట్రంప్ ప్రత్యేక రాయబారి భేటీ

### యుద్ధం కొలిక్కి వచ్చేనా?

**రష్యా :** ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపుపై ఓ ఒప్పందానికి రావాలంటూ రష్యాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీనిపై నిర్ణయం తీసుకోకపోతే పెద్దఎత్తున సుంకాలతో శిక్షిస్తానని హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల మధ్య ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ నేడు మాస్కో వేదికగా రష్యా అధినేత పుతిన్‌తో సమావేశమయ్యారు. ఈ విషయాన్ని క్రెమ్లిన్ వెల్లడించింది. ఒప్పందం విషయంలో పుతిన్‌కు ట్రంప్ విధించిన గడువు శుక్రవారంతో ముగియనున్న నేపథ్యంలో ఈ భేటీ కీలక ప్రాధాన్యం సంతరించుకుంది. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర ప్రారంభించిన విషయం తెలిసిందే. ఉక్రెయిన్ సైతం ఎదురుదాడులు కొనసాగిస్తుండటంతో ఇటీవల కాలంలో యుద్ధం తీవ్రత మరింత ముదిరింది. యుద్ధం ముగింపు విషయంలో ఇస్తాంబుల్ వేదికగా ఇరుదేశాల మధ్య జరిగిన మూడు రౌండ్ల చర్చలు విఫలమయ్యాయి. తాను అధికారంలోకి వస్తే యుద్ధానికి తెరదించుతానని పేర్కొన్న డొనాల్డ్ ట్రంప్.. ఈ మేరకు ప్రయత్నాలు చేస్తున్నారు. యుద్ధం ముగింపుపై తొలుత 50రోజుల్లోపు ఓ ఒప్పందానికి రావాలని రష్యాను హెచ్చరించిన ఆయన.. ఇటీవల ఆ గడువును మరింత తగ్గించారు. మరోవైపు.. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 4.30 గంటలకు (భారత్‌లో గురువారం అర్ధరాత్రి 2 గంటలకు) ట్రంప్ ఓవల్ ఆఫీసులో కీలక ప్రకటన చేయనున్నట్లు సమాచారం. ఒకవేళ రష్యా కాల్పుల విరమణకు అంగీకరించకపోతే.. ఆ దేశంపై ఆంక్షలు విధించే అవకాశాలు కన్పిస్తున్నాయి. భారత్‌పైనా సుంకాలు పెంచుతానంటూ ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. తమపై అమెరికా విధించిన అంతర్జాతీయ ఆంక్షలు పరిమిత ప్రభావాన్నే చూపాయని క్రెమ్లిన్ ఇదివరకే స్పష్టం చేసింది. ఉక్రెయిన్ మాత్రం.. ఆంక్షలను మరింత పెంచాలని పాశ్చాత్య మిత్రదేశాలను కోరుతోంది.

# భారత్‌పై పాక్ అక్కసు.. కశ్మీర్‌పై మళ్లీ అదే పాట



**పాకిస్థాన్ :** జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దయి ఆరేళ్లు పూర్తయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కశ్మీర్ అంశంపై మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్- పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలకు కశ్మీర్ ప్రధాన కారణమని మరోసారి నోరు పారేసుకున్నారు. శాంతిస్థాపన కోసం 2019లో భారత ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు చేయడంపై అక్కసు వెళ్లగక్కారు. ఈ విషయంలో న్యూదిల్లీ ఏకపక్షంగా చర్యలు తీసుకుందంటూ ఆయన భారత్‌పై నిందలు మోపారు. ఈ సమస్యకు న్యాయపరమైన పరిష్కారానికి తమ విదేశాంగ విధానం కట్టుబడి ఉందంటూ మళ్లీ పాత పాటే పాడారు. ఓ ర్యాలీలో పాక్ ఉప ప్రధాని ఇషాక్‌దార్ మాట్లాడుతూ.. తాము పొరుగుదేశాలతో స్నేహపూర్వక సంబంధాలను కోరుకుంటున్నామన్నారు. ఘర్షణల కంటే దౌత్యాన్నే ఇష్టపడతామంటూ వ్యాఖ్యలు చేశారు. ఈసందర్భంగా ఎవరైనా దురాక్రమణలకు పాల్పడితే గట్టిగా బదులు ఇచ్చేందుకు తమ సాయుధ దళాలు తగిన సామర్థ్యం కలిగి ఉన్నాయన్నారు. ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో సహా పలు ప్రావిన్స్‌లలో నిరసన కార్యక్రమాలు నిర్వహించడం గమనార్హం.



# 45 పైసలకే ప్రమాద బీమా..

### ఐదేళ్లలో 27.22 కోట్లు చెల్లింపు : అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ :** ఇ-టికెట్లతో రైలు టికెట్ బుకింగ్ చేసుకునే ప్రయాణికులు కేవలం 45 పైసల ప్రీమియంతో ప్రయాణ బీమా సదుపాయం పొందొచ్చని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. రైల్వే బీమా సదుపాయానికి సంబంధించి సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన పార్లమెంట్‌లో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ప్రయాణికులు ఆన్‌లైన్ లేదా రిజర్వేషన్ కౌంటర్ల వద్ద తీసుకునే టికెట్‌లో ఈ ఆప్షనల్ ట్రావెల్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను ఎంపిక చేసుకోవచ్చన్నారు. ఈ బీమా పథకం ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకున్న కన్ఫర్మ్‌డ్ ప్రయాణికులకు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. ఈ బీమా ప్రయోజనం పొందాలనుకునే వారు టికెట్ బుకింగ్ సమయంలో ఆప్షన్‌ను స్వయంగా ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. 'ఈ పథకాన్ని ఎంచుకున్న వారికి అదనపు బీమా కవరేజ్ లభిస్తుంది. ప్రీమియంగా 45 పైసలు మాత్రమే వసూలు చేస్తారు. ఇది టికెట్ ధరతో పాటు చెల్లించాల్సి ఉంటుంది' అని మంత్రి తెలిపారు. అలాగే ప్రయాణికులకు నమోదు చేసుకున్న మొబైల్ నంబర్, ఇ-మెయిల్ ఐడీకి బీమా పాలసీ వివరాలు అందుతాయని తెలిపారు. పాలసీకి సంబంధించిన నామినీ వివరాలు నమోదు చేసుకునే లింక్ కూడా మెసేజ్ వస్తుందని చెప్పారు. బీమా పాలసీ జారీ, క్లెయిమ్ సెటిల్‌మెంట్‌కు సంబంధించి బీమా సంస్థే పూర్తి బాధ్యత వహిస్తుందన్నారు. ప్రయాణికులు, బీమా సంస్థ మధ్యే ఈ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. బీమాను ఎలా క్లెయిమ్ చేసుకోవాలనే వివరాలు సదరు బీమా సంస్థ పంపిన మెయిల్‌లో ఉంటాయని చెప్పారు. ప్రయాణికులు నేరుగా సంస్థతోనే క్లెయిమ్ దాఖలు చేసి పరిష్కరించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ ఆప్షనల్ ట్రావెల్ ఇన్సూరెన్స్ స్కీమ్ కింద ఐదేళ్లలో మొత్తం 333 బీమా క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. రూ.27.22 కోట్లను ప్రయాణికులు లేదా వారి కుటుంబ సభ్యులకు బీమా సంస్థలు చెల్లించాయని పేర్కొన్నారు. ఈ బీమా పథకం ప్రయాణికులకు అనుకూలంగా ఉండే విధంగా రూపొందించామని, తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనం అందించడమే లక్ష్యంగా దీన్ని తీసుకొచ్చామని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. కేవలం 45 పైసలకే ఈ బీమా లభించడంతో ఇది ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటుందన్నారు. "ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా యాప్‌లో టికెట్ బుక్ చేసే సమయంలో ట్రావెల్ ఇన్సూరెన్స్ కోసం బీమా ఆప్షన్ పక్కనున్న టిక్ బాక్స్‌ను ప్రత్యేకంగా ఎంచుకొనే పనిలేదు. ఈ ఆప్షన్ డిఫాల్ట్‌గా వస్తోంది. అయితే ఈ ప్రయోజనాలను వద్దనుకున్నవారు మాత్రం ఆ టిక్ మార్క్‌ను తీసేయొచ్చు. దీనికోసం ఎటువంటి అదనపు దరఖాస్తు గానీ, పత్రాలు గానీ అవసరం లేదు" అని మంత్రి పేర్కొన్నారు.

# కర్మ ఎవ్వరినీ వదిలిపెట్టదు

## రవిచంద్రన్ అశ్విన్



తెందూల్కర్ – అండర్సన్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్‌తో టీమ్‌ఇండియా అయిదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడింది. ఈ సిరీస్ 2–2తో భారత జట్టు డ్రా చేసుకోగలిగింది. అయితే, మాంచెస్టర్ వేదికగా జరిగిన నాలుగో టెస్టు మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో రిషభ్‌పంత్ రివర్స్ స్వీప్ ఆడుతూ గాయపడ్డాడు. అప్పుడు బంతి బలంగా పంత్ పాదానికి తాకింది. దీంతో నొప్పితో విలవిల్లాడిపోయాడు. చివరికి గోల్ఫ్‌కార్ట్‌పై మైదానాన్ని వీడాడు. తర్వాత మరుసటి రోజు అతికష్టం మీద బ్యాటింగ్‌కు వచ్చాడు. ఆఖరికి హాఫ్ సెంచరీ (54) చేసిన తర్వాత పెవిలియన్‌కు చేరాడు. రెండో ఇన్నింగ్స్‌లో అతడు బ్యాటింగ్‌కు రాలేదు. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్.. టెస్ట్ క్రికెట్‌లో 'ఇంజూరీ రిప్లేస్‌మెంట్స్' ఉండేలా కొత్త నిబంధనలు రావాల్సిన అవసరం ఉందన్నాడు. గంభీర్ చేసిన ఈ వ్యాఖ్యలను ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్‌స్టోక్స్ కొట్టి పడేశాడు. ఆ ప్రతిపాదన హాస్యాస్పదంగా ఉందంటూ వ్యంగ్యంగా స్పందించాడు. అయితే ఓవల్‌లో జరిగిన అయిదో టెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ జట్టు అచ్చం ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంది. ఆ టీమ్ ఫాస్ట్ బౌలర్ క్రిస్ వోక్స్ భుజం గాయం కారణంగా ఇబ్బంది పడ్డాడు. అతడు మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగలేదు. కానీ రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు రాక తప్పలేదు. విజయానికి ఇంగ్లాండ్‌కు 20 పరుగులు అవసరమైన దశలో వోక్స్ ఒంటి చేత్తో బ్యాట్ పట్టుకుని ఆడటానికి వచ్చాడు. ఈ విషయం గురించే రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడాడు. "ఈ సిరిస్‌లో జరిగిన ఘటన గురించి నేను మాట్లాడాలనుకుంటున్నాను. 'కర్మ ఎవ్వరినీ వదిలిపెట్టదు. తక్షణమే బదులిస్తుంది' అనే అర్థంలో తమిళ సామెత ఉంది. మనం ఏమి విత్తితే.. ఆ పంటనే కోస్తాం. నాలుగో టెస్ట్ మ్యాచ్‌లో పంత్ గాయం మీద విలేకరులు టీమ్‌ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్‌ను ప్రశ్నలు అడిగారు. మ్యాచ్ మధ్యలో గాయపడిన ఆటగాళ్ల స్థానంలో మరొకరిని తీసుకునే వెసులుబాటు ఉంటే బాగుంటుందని అతడు స్పందించాడు. ఈ విషయాన్ని వారు బెన్‌స్టోక్స్ దగ్గర ప్రస్తావించినప్పుడు. అతడు అదో హాస్యాస్పదమైన ప్రతిపాదన అని తోసిపుచ్చాడు. క్రికెట్‌లో బెన్‌స్టోక్స్ శక్తిసామర్థ్యాలకు నేను వ్యక్తిగతంగా పెద్ద అభిమానిని. కానీ.. అతడు సమాధానం చెప్పే ముందు కాస్త ఆలోచించి మాట్లాడాలి' అని అశ్విన్ చురకలంటించాడు. అలాగే సబ్‌స్టిట్యూట్స్ విషయంలో ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ మైఖేల్ వాన్ వ్యాఖ్యల గురించి ప్రస్తావించాడు. 'సబ్‌స్టిట్యూట్స్‌ను అనుమతించాలని మైఖేల్ వాన్ కూడా అన్నాడు. నేను ఏమి చెబుతున్నా అంటే.. ప్రత్యర్థి జట్టు మీద కాస్తైనా సానుభూతి చూపించాలి. రిషభ్ పంత్ స్థాయి శక్తిసామర్థ్యాలున్న ఆటగాడు ఇంగ్లాండ్ టీమ్ తరఫున ఆడుతూ గాయడితే జట్టు పరిస్థితి ఎలా ఉంటుందో స్టోక్స్ ఓ సారి ఆలోచించాలి' అని రవిచంద్రన్ అశ్విన్ కుండబద్దలు కొట్టాడు.



## భారత క్రికెట్ ఎవరి కోసమూ ఆగదు

### సౌరభ్ గంగూలీ

స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు సుదీర్ఘ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. దీంతో ఇంగ్లాండ్ టూర్‌లో టీమ్‌ఇండియా బ్యాటింగ్ విభాగం బలహీనపడుతుందని అంతా భావించారు. కానీ, పెద్దగా అనుభవం లేని మన కుర్రాళ్లు ఇంగ్లాండ్‌లో అదరగొట్టారు. సిరీస్‌లో అత్యధిక రన్స్ చేసిన టాప్–6 బ్యాటర్లలో మనోళ్లే నలుగురు ఉన్నారు. ఇక, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 2–2తో ముగించడంతో భారత జట్టుపై ప్రశంసల జల్లు కురుస్తోంది. ఈ క్రమంలో టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత క్రికెట్ ఎవరి కోసం ఆగదని, స్టార్ క్రికెటర్లు లేని లోటును యువ ఆటగాళ్లు భర్తీ చేశారన్నాడు. 'భారత క్రికెట్ ఎవరి కోసమూ ఆగదు. మన దేశంలో ఎంతోమంది ప్రతిభావంతులైన క్రికెటర్లున్నారు. ఇంగ్లాండ్ టూర్‌లో మన ఆటగాళ్లు బ్యాటింగ్ చేసిన తీరు అద్భుతం. భారత క్రికెట్ అలాగే ఉంది. సునీల్ గావస్కర్ రిటైర్ అయిన తర్వాత ఆ లోటును సచిన్ తెందూల్కర్ భర్తీ చేశాడు. అదే సమయంలో రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్, వీవీఎస్ లక్ష్మణ్ వచ్చారు. అనంతరం వచ్చిన విరాట్ కోహ్లీ స్టార్ ఆటగాడిగా ఎదిగాడు. కోహ్లీ తర్వాత యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్, శుభ్‌మన్ గిల్ స్టార్స్‌గా మారారు. భారత క్రికెట్‌లో చాలా ప్రతిభ ఉంది, అది పెరుగుతూనే ఉంటుంది. మన దేశవాళీ క్రికెట్ చాలా బలంగా ఉంది. ఐపీఎల్, భారత్ ఎ జట్టు, అండర్–19 జట్టు రూపంలో మనకు చాలా వేదికలు ఉన్నాయి' అని గంగూలీ పేర్కొన్నాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌ను గెలవకపోయినప్పటికీ టీమ్‌ఇండియా ప్రదర్శనపై గంగూలీ సంతృప్తి వ్యక్తం చేశాడు. 'ఇంగ్లాండ్‌లో భారత్ అద్భుతంగా ఆడింది. మాంచెస్టర్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 0/2తో నిలిచిన టీమ్‌ఇండియా ఆ మ్యాచ్‌లో పుంజుకుని మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. తర్వాత ఓవల్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేసింది. శుభ్‌మన్ గిల్, గౌతమ్ గంభీర్‌కు అభినందనలు. భారత టాప్ ఆరుగురు బ్యాటర్లు కేఎల్ రాహుల్, గిల్, యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ అదరగొట్టారు' అని దాదా ప్రశంసించాడు.

## కెరీర్‌లో బెస్ట్ ర్యాంక్ అందుకున్న సిరాజ్

### టాప్-5లోకి జైస్వాల్

ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో అదరగొట్టిన టీమ్‌ఇండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో గణనీయమైన స్థానాలను మెరుగుపర్చుకున్నాడు. 12 స్థానాలు ఎగబాకి కెరీర్‌లో తొలిసారి టాప్–15లో నిలిచాడు. దీంతో సిరాజ్ 674 రేటింగ్ పాయింట్లతో 15వ స్థానానికి చేరాడు. ఇంతకుముందు ఈ హైదరాబాదీ పేసర్ బెస్ట్ ర్యాంకు 16. ఓవల్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదో టెస్టులో సిరాజ్ 9 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. టీమ్‌ఇండియా మరో పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ 25 స్థానాలు ఎగబాకి 59వ ర్యాంకులో నిలిచాడు. రవీంద్ర జడేజా మూడు స్థానాలు డౌన్ అయి 17వ ర్యాంక్‌లో నిలిచాడు. ఓవల్ టెస్టుకు దూరంగా ఉన్నా జస్‌ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. ఇక, ఓవల్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ తిరిగి టాప్–లోకి వచ్చాడు. మూడు స్థానాలు మెరుగై 792 రేటింగ్ పాయింట్లతో ఐదో స్థానంలో ఉన్నాడు. రిషబ్ పంత్ ఎనిమిదో స్థానంలో ఉండగా.. శుభ్‌మన్ గిల్ నాలుగు స్థానాలు దిగజారి 13వ ర్యాంక్‌కు పడిపోయాడు. ఇంగ్లాండ్ ఆటగాళ్లు జో రూట్, హ్యారీ బ్రూక్ తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

## బుమ్రాలానే సిరాజ్ వర్క్‌లోడ్‌ను బీసీసీఐ పర్యవేక్షించాలి

### మాజీ క్రికెటర్ ఆర్పీసింగ్



జస్‌ప్రీత్ బుమ్రా వర్క్‌లోడ్‌ను పర్యవేక్షిస్తున్నట్లుగానే.. మహమ్మద్ సిరాజ్ విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ ఆర్పీసింగ్, బీసీసీఐకి సూచించాడు. సిరాజ్ ఈ ఇంగ్లాండ్ సిరీస్‌లో అందరికంటే ఎక్కువగా అయిదు టెస్టు మ్యాచుల్లో కలిపి ఏకంగా 185.3 ఓవర్లపాటు బౌలింగ్ వేశాడు. అలాగే 23 వికెట్లు తీసుకున్నాడు. రెండు సార్లు అయిదు వికెట్ల ప్రదర్శన చేశాడు. ఈ సిరీస్‌లో చివరి మ్యాచైన ఓవెల్‌లోనూ బౌలింగ్‌లో రాణించాడు. ఈ టెస్ట్‌లో అతడు తొమ్మిది వికెట్లు తీసుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో అయిదు వికెట్ల ప్రదర్శనతో.. ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 6 పరుగుల తేడాతో విజయం సాధించేలా కృషి చేశాడు. అలాగే గాయాల పాలవ్వకుండా సిరాజ్‌పై బీసీసీఐ యాజమాన్యం అనుసరించాల్సిన వ్యూహాల గురించి టీమ్‌ఇండియా మాజీ పేసర్ ఆర్పీసింగ్ మాట్లాడాడు. 'సిరాజ్ విషయంలోనూ వర్క్‌లోడ్‌ను పరిగణనలోకి తీసుకోవాలి. లేదంటే భవిష్యత్తులో అతడు కూడా గాయాలపాలయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్లకు ఇతర ఆటగాళ్లకంటే ఎక్కువగా గాయాలయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే బుమ్రా విషయంలో అనుసరిస్తున్న వర్క్‌లోడ్ విధానాన్నే సిరాజ్ విషయంలోనూ బీసీసీఐ అవలంబించాలి' అని ఆర్పీసింగ్ అన్నాడు. బుమ్రాకు సిరాజ్ నుంచి ఎలా మద్దతు లభిస్తుందో అనే విషయమై కూడా ఈ మాజీ పేసర్ మాట్లాడాడు. 'బ్యాటింగ్‌లో అయితే బ్యాటర్ల మధ్య ఎలా భాగస్వామ్యం ఉంటుందో.. బౌలర్ల మధ్య కూడా అలాగే ఉంటుంది! ముఖ్యంగా విలక్షణమైన బౌలింగ్ యాక్షన్ వల్ల బుమ్రా.. బ్యాటర్లను ఇబ్బందులకు గురిచేసి ఎక్కువ వికెట్లు తీసుకోగలడు. అదే సమయంలో సిరాజ్ మరో ఎండ్ నుంచి బ్యాటర్ల మీద ఒత్తిడి తీసుకువస్తాడు. ఇలా బౌలింగ్‌లో వీరిద్దరి భాగస్వామ్యం ప్రత్యర్థి జట్టు మీద పై చేయి సాధించేందుకు దోహదపడుతుంది. బుమ్రా జట్టులో లేనప్పుడు మాత్రం సిరాజే పేస్ దళానికి నాయకత్వం వహిస్తాడు' అని ఆర్పీసింగ్ పేర్కొన్నాడు 'సరైన వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌తో బుమ్రా.. వన్డే, టీ20 వరల్డ్ కప్ మ్యాచుల్లో ఆడేందుకు అవకాశం ఉంటుంది. ఇదే వ్యూహం సిరాజ్ విషయంలోనూ అనుసరిస్తే.. అతడూ వన్డే, టీ20 వరల్డ్ కప్ మ్యాచుల్లో అద్భుతమైన ప్రదర్శనలు చేయగలడు' అని ఆర్పీసింగ్ విశ్లేషించాడు.

## చరిత్ర సృష్టించిన రషీద్ ఖాన్

### టీ20ల్లో తొలి బౌలర్‌గా రికార్డు



అఫ్గానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ టీ20 క్రికెట్‌లో అద్భుతమైన రికార్డు సాధించాడు. పొట్టి ఫార్మాట్ క్రికెట్‌లో 650 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా రికార్డులకెక్కాడు. ఇంగ్లాండ్ వేదికగా జరుగుతున్న ది హండ్రెడ్ లీగ్ ఆరంభ మ్యాచ్‌లో ఈ ఘనతను సాధించాడు. ఓవల్ ఇన్విన్సిబుల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న రషీద్ ఖాన్ లండన్ స్పిరిట్‌తో జరిగిన లీగ్ ఆరంభ పోరులో విజృంభించాడు. 20 బంతుల్లో (3/11) అదరగొట్టాడు. 15 డాట్ బాల్స్ చేసిన రషీద్ వేన్ మాడ్సెన్, లియామ్ డాసన్, ర్యాన్ హిగ్గిన్స్‌ను ఔట్ చేశాడు. ఈ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఇక, మ్యాచ్ విషయానికొస్తే తొలుత బ్యాటింగ్ చేసిన లండన్ స్పిరిట్ జట్టు 94 బంతుల్లో 84 పరుగులే చేసి ఆలౌటైంది. ఆ జట్టుకు ఆడుతున్న స్టార్ బ్యాటర్లు డేవిడ్ వార్నర్ (9), కేన్ విలియమ్సన్ (9) విఫలమయ్యారు. ఓవల్ ఇన్విన్సిబుల్స్ 4 వికెట్లు కోల్పోయి 31 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించింది.

**టీ20 క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లు**

- రషీద్ ఖాన్ 651 (478 ఇన్నింగ్స్‌లు)
- డ్వేన్ బ్రావో 631 (546 ఇన్నింగ్స్‌లు)
- సునీల్ నరైన్ 589 (544 ఇన్నింగ్స్‌లు)
- ఇమ్రాన్ తహీర్ 547 (417 ఇన్నింగ్స్‌లు)
- షకీబ్ అల్ హసన్ 498 (443 ఇన్నింగ్స్‌లు)
- ఆండ్రీ రస్సెల్ 485 (497 ఇన్నింగ్స్‌లు)
- క్రిస్ జోర్డాన్ 436 (404 ఇన్నింగ్స్‌లు)
- వహాబ్ రియాజ్ 413 (344 ఇన్నింగ్స్‌లు)

# భారత్‌పై ట్రంప్ సుంకాల మోత.. మరో 25 శాతం వడ్డన



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు జరుపుతున్న భారత్‌పై మరో 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే భారత్‌పై 25 శాతం ప్రతీకార సుంకం విధించారు. దీంతో భారత్ నుంచి దిగుమతయ్యే ఉత్పత్తులపై 50 శాతం సుంకం వర్తించనుంది. ఈ మేరకు బుధవారం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకం చేశారు. రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో అక్కసు వెళ్లగక్కుతున్న ట్రంప్.. 24 గంటల్లో భారత్‌పై భారీ టారిఫ్ వేస్తానని మంగళవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా అన్నంత పనీ చేశారు. రష్యా నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా చమురు కొనుగోళ్లు జరుపుతున్నందునే ఈ టారిఫ్ విధిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో ట్రంప్ స్పష్టంగా పేర్కొన్నారు. ప్రతీకార సుంకాల్లో భాగంగా ఇప్పటికే విధించిన 25 శాతం సుంకాలు ఆగస్టు 7 నుంచి అమల్లోకి రానుండగా.. కొత్తగా విధించిన 25 శాతం అదనపు సుంకాలు ఆగస్టు 27 నుంచి వర్తింపజేస్తు న్నట్లు ట్రంప్ తన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో పేర్కొన్నారు. ఒకవేళ ఈ సుంకాలకు ప్రతీకారంగా భారత్ ఏదైనా సుంకాలు వడ్డించాలని ప్రయత్నిస్తే ఈ టారిఫ్‌లను అధ్యక్షుడు సవరించొచ్చని వైట్‌హౌస్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

### చైనా తర్వాత మనపైనే..

వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడంలో ఒక్కో దేశాన్ని తన దారికి తెచ్చుకునే ఎత్తుగడలో భాగంగా ట్రంప్ ఇప్పటికే పలు దేశాలపై సుంకాలు విధించారు. తాజాగా రష్యా చమురును కొనుగోళ్లను నిలిపివేయలేదన్న కారణంతో భారత్‌పై ఏకంగా 50 శాతం టారిఫ్ మోపారు. దీంతో చైనా తర్వాత ఆసియాలో అత్యధిక టారిఫ్‌లు ఎదుర్కొంటున్న దేశంగా భారత్ నిలిచింది. ప్రస్తుతం చైనా ఉత్పత్తులపై 51 శాతం సుంకం అమెరికా విధిస్తోంది. మలేసియాపై 25 శాతం, శ్రీలంకపై 30, వియత్నాంపై 20 శాతం, ఇండోనేసియాపై 19 శాతం చొప్పున ట్రంప్ టారిఫ్ విధించారు. వాణిజ్య ఒప్పందంలో భాగంగా జపాన్‌పై 15 శాతం టారిఫ్ ప్రకటించారు.



## వరుసగా రెండోరోజూ నష్టాల్లో సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండోరోజూ నష్టాల్లో ముగిశాయి. ఆర్‌బీఐ ఈసారి కీలక రేట్లను స్థిరంగా ఉంచడం ప్రభావం చూపింది. ఆర్‌బీఐ నిర్ణయం మార్కెట్ అంచనాలకు అనుగుణంగానే ఉన్నప్పటికీ.. రేట్ సెన్సిటివ్ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలను పడేశాయి. మరోవైపు ట్రంప్ టారిఫ్‌ల హెచ్చరికలూ సూచీలను ప్రభావితం చేశాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందు రాబోయే 24 గంటల్లో భారత్‌పై టారిఫ్‌లు విధిస్తానని ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఫార్మా, సెమీకండక్టర్ పరిశ్రమపైనా సుంకాలు వేస్తానని ప్రకటించారు. దీంతో మదుపర్లు అప్రమత్తత పాటించారు. సెన్సెక్స్ ఉదయం 80,694.98 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,710.25) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీ.. చివరికి 166.26 పాయింట్ల నష్టంతో 80,543.99 వద్ద ముగిసింది. నిఫ్టీ 75.35 పాయింట్ల నష్టంతో 24,600 స్థాయిని కోల్పోయి 24,574.20 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.73గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టపోయాయి. ఏషియన్ పెయింట్స్, బీఈఎల్, ట్రెంట్, అదానీ పోర్ట్స్, ఎస్‌బీఐ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 68.69 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3419 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




## వీక్లీ కాంట్రాక్టుల నిలిపివేత ప్రచారం ఊహాజనితం: సెబీ ఛైర్మన్

స్టాక్ మార్కెట్‌లో స్పెక్యులేషన్‌ను నియంత్రించేందుకు వారంతపు ఎక్స్‌పైరీలను నిలిపివేసే ప్రతిపాదనలేవీ లేవని.. ప్రచారంలో ఉన్నవి ఊహాజనితాలేనని బుధవారం సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే వివరణ ఇచ్చారు. తమ వద్దకు అటువంటి ప్రతిపాదన ఏమీ రాలేదని.. మీడియాలో వచ్చిన కథనాలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. అసలు ఇటువంటి సంస్కరణలను ఓ పద్ధతి ప్రకారం చర్చిస్తామని చెప్పారు. పాండే వివరణ తర్వాత బీఎస్‌ఈ షేర్లు వేగంగా కోలుకొన్నాయి. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 1.50శాతం పుంజుకొని రూ.2405 వద్దకు చేరుకొన్నాయి. వాస్తవానికి సెబీ వారంతపు ఎక్స్‌పైరీలను నిలిపివేస్తుందని.. దీన్ని రెండు వారాలకు ఒక్కసారిగా మారుస్తుందని మంగళవారం కొన్ని మీడియా సంస్థల్లో కథనాలు వెలువడ్డాయి. ఇది జరిగితే బీఎస్‌ఈ, నిఫ్టీ ఎక్స్‌పైరీలు మారిపోతాయి. ప్రస్తుతం బీఎస్‌ఈ మంగళవారం, నిఫ్టీ 50 కాంట్రాక్టులు గురువారం ముగుస్తున్నాయి. ప్రచారం జరిగినట్లు మారితే.. ఇవి ప్రతి రెండు వారాలకు ఒకసారి ముగుస్తాయి. గత నెల సెబీ పూర్తికాల సభ్యుడు అనంత్ నారాయణన్ స్వల్పకాల ఎఫ్ అండ్ ఓ కాంట్రాక్టులు భారీ వాల్యూమ్‌ల్లో ట్రేడ్‌కావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వీటి నాణ్యత పెంచేందుకు గడువు పెంచే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. ఈ వ్యాఖ్యలు కూడా తాజా ప్రచారానికి ఊతం ఇచ్చాయి. ఇప్పటికే అప్షన్ ట్రేడింగ్‌లో సెబీ చాలా నియంత్రణలను తీసుకొచ్చింది. గతేడాది నవంబర్‌లో మార్కెట్లో హెచ్చుతగ్గులను అదుపు చేసేందుకు చాలా మార్పులు చేసింది. ఈ ఏడాది జులైలో సెబీ నిర్వహించిన ఓ అధ్యయనంలో రిటైల్ ఇన్వెస్టర్ల నష్టాలకు సంబంధించిన కీలక డేటా వెల్లడైంది. ఒక్కో చిన్న మదుపుదారు ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లో 2024–2025 ఆర్థిక సంవత్సరానికి రూ.1.06లక్షల కోట్లు నష్టపోయినట్లు తేలింది. ఇదే 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.74,812 కోట్లుగా ఉంది.

## వాట్సప్‌లో సేఫ్టీ ఫీచర్..

### గ్రూపులో చేరితే గత చరిత్ర ప్రత్యక్షం




ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా వినియోగించే మెసేజింగ్ యాప్ వాట్సప్‌లో మరో కొత్త స్కామ్ నివారణ ఫీచర్ అందుబాటులోకి వచ్చింది. 'సేఫ్టీ ఓవర్‌వ్యూ' పేరిట దీన్ని లాంచ్ చేసింది. మీ కాంటాక్ట్ లిస్ట్‌లో లేని, తెలియని వ్యక్తులు మిమ్మల్ని ఏదైనా గ్రూప్‌లో యాడ్ చేసినపుడు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. ఆ గ్రూప్‌నకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలియజేస్తుంది. ఫిషింగ్, స్కామ్‌ల నుంచి ముప్పు నుంచి ఎలా జాగ్రత్తపడాలో అందులో సూచనలు కనిపిస్తాయి. మోసాలు అరికట్టడంలో భాగంగా వాట్సప్ ఆ కోవకు చెందిన 6.8 మిలియన్ ఖాతాలను ఇప్పటికే బ్యాన్ చేసింది. ఈ చర్యల్లో భాగంగానే సేఫ్టీ ఓవర్‌వ్యూ ఫీచర్‌ను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు వాట్సప్ తన బ్లాగ్‌పోస్ట్‌లో పేర్కొంది. మీకు తెలియని వ్యక్తి మిమ్మల్ని గ్రూప్‌లో చేర్చినపుడు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. ఇందులో మిమ్మల్ని యాడ్ చేసిన వ్యక్తి, గ్రూప్‌ను సృష్టించిన వ్యక్తికి సంబంధించిన సమాచారం, దాంట్లోని మొత్తం సభ్యులు, గ్రూప్‌ను ఏ తేదీన సృష్టించారనేది చూపిస్తుంది. ఈ సమాచారం ఆధారంగా మీరు గ్రూపులో ఉండాలా? లేదా? అనేది నిర్ణయించుకోవచ్చు. అవసరమైతే గ్రూప్‌లో చేరేముందు ప్రీవియస్ చాట్‌ను కూడా చూడొచ్చు. ఇంతకుముందు ఇలా ప్రీవియస్ చాట్‌ను చూసే వెసులుబాటు లేదు. ఎగ్జిట్ అవ్వాలనుకుంటే గ్రూప్‌లో మెసేజ్‌లను చూడకుండానే అవ్వొచ్చు. మీరు గ్రూప్‌లో ఉండాలనుకుంటే మాత్రం చెక్‌మార్క్ చేయాల్సి ఉంటుంది. అప్పటివరకు మెసేజ్ నోటిఫికేషన్లు మ్యూట్‌లోనే ఉంటాయి. స్టాక్ మార్కెట్, క్రిప్టో కరెన్సీల్లో ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించిన పెట్టుబడి చిట్కాలంటూ కొందరు మనల్ని తెలీని గ్రూప్‌లో యాడ్ చేస్తుంటారు. అలాంటి సందర్భాల్లో ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. త్వరలో మరో ఫీచర్: కాంటాక్ట్ లిస్ట్‌లో లేని వ్యక్తి మీకు మెసేజ్ చేస్తే హెచ్చరిక వచ్చే విధంగా వాట్సప్ త్వరలో మరో ఫీచర్‌ను తీసుకురానుంది. చాట్‌ను ప్రారంభించడానికి ముందే ఆ వ్యక్తికి సంబంధించి కొంత అదనపు సమాచారాన్ని చూపించే విధంగా దీన్ని రూపొందించనున్నారు. వాట్సప్‌లో జరిగే మోసాలను అరికట్టడమే లక్ష్యంగా కంపెనీ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

# నటి శ్వేతా మేనన్‌పై కేసు నమోదు

మలయాళ నటి శ్వేతా మేనన్‌పై కేసు నమోదైంది. సామాజిక కార్యకర్త మార్టిన్ ఫిర్యాదు మేరకు ఆమెపై కొచ్చి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె నటించిన పలు సినిమాల్లోని అభ్యంతరకర సన్నివేశాలు, వాణిజ్య ప్రకటనలు సోషల్ మీడియాలో ప్రసారం కావడంపై కొన్ని రోజుల క్రితం ఫిర్యాదు చేయగా.. పోలీసులు అప్పుడు పట్టించుకోలేదని సమాచారం. దీంతో, ఆయన ఎర్నాకుళం కోర్టును ఆశ్రయించారు. డబ్బు కోసం అడల్ట్ చిత్రాల్లో నటిస్తూ యువతను తప్పుదోవ పట్టిస్తున్నారని మార్టిన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ (అమ్మ) అధ్యక్ష పదవికి శ్వేతా మేనన్ పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సమయంలో ఆమెపై కేసు నమోదు కావడం చర్చనీయాంశమైంది. 1994లో 'ఫెమినా మిస్ ఇండియా ఏషియా పసిఫిక్'గా నిలిచిన శ్వేతా మేనన్ నటించిన తొలి సినిమా 'అనస్వరం'. 'రతి నిర్వేదం', '100 డిగ్రీ సెల్సియస్'లాంటి మలయాళ మూవీస్‌తోపాటు టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లోనూ నటించారు. తెలుగులో 'ఆనందం'లో ప్రత్యేక గీతంలో మెరిసిన శ్వేత.. 'జూనియర్స్', 'రాజన్న' తదిరత సినిమాల్లో సందడి చేశారు.

# సంక్రాంతికి 'రాజాసాబ్'..




ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది రాజాసాబ్'. బిగ్గెస్ట్ హారర్ ఫాంటసీ ఫిల్మ్‌గా ఇది సిద్ధమవుతోంది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న విడుదల చేయనున్నట్లు గతంలో దర్శక నిర్మాతలు తెలిపారు. అయితే, కొన్ని రోజులుగా ఇది వాయిదా పడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అలాగే తాజాగా విడుదల చేసిన మాళవిక మోహనన్ పోస్టర్‌పై రిలీజ్ డేట్ లేకపోవడంతో ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిర్మాత టీజీ విశ్వప్రసాద్ దీని రిలీజ్‌పై మాట్లాడారు. షూటింగ్ దాదాపు పూర్తయిందని అన్నారు. "ది రాజాసాబ్" సంక్రాంతికి వస్తే బాగుంటుందని ప్రభాస్ అభిమానులు కోరుకుంటున్నారు. వారి హీరోను పెద్ద పండగకు స్క్రీన్‌పై చూసుకోవాలని భావిస్తున్నారు. తెలుగు బిజినెస్ సర్కిల్ వారు కూడా ఈ సినిమాను జనవరి 9న విడుదల చేయాలని చెబుతున్నారు. కానీ, హిందీ ఆడియన్స్ మాత్రం డిసెంబర్ 5న విడుదల చేయాలని బలంగా కోరుతున్నారు. ఎందుకంటే డిసెంబర్‌లో అక్కడ పెద్ద సినిమాలు ఏవీ లేవు. అందుకని సంవత్సరం చివర్లో విడుదల చేయాలని అంటున్నారు". "అక్టోబర్ చివరికి సినిమా అంతా పూర్తవుతుంది. ఇప్పటికే దాదాపు చిత్రీకరణంతా పూర్తయింది. కొన్ని పాటలు షూట్ చేయాలంతే. మొత్తం 4.30 గంటల సినిమా వచ్చింది. దాన్ని ఎడిట్ చేసి కుదించాలి. ఇందులో అన్ని ఎలిమెంట్స్ ఉన్నాయి. మాస్, క్లాస్ అన్నివర్గాల వారిని 'ది రాజాసాబ్' కచ్చితంగా అలరిస్తుంది. విడుదలపై నిర్ణయం తీసుకోవాలి" అని నిర్మాత తెలిపారు. 'రాజాసాబ్ 2' కూడా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. హారర్ కామెడీ నేపథ్యంలో ఇది ముస్తాబవుతోంది. ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలుగా కనిపించనున్నారు. సంజయ్‌దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. 'రాజాసాబ్' కోసం నిర్మించిన హవేలి రాజ్‌మహల్ సెట్‌ను టీమ్ ఇప్పటికే మీడియాకు చూపించింది. దాదాపు రూ.7 కోట్లకు పైగా ఖర్చుతో ప్రొడక్షన్ డిజైనర్ రాజీవన్ నిర్మించిన ఆ సెట్ సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలవనుందని చిత్రబృందం తెలిపింది.

# బాలకృష్ణను కలిసిన టాలీవుడ్ నిర్మాతలు



టాలీవుడ్‌లో సినీ కార్మికుల వేతనాల పెంపుపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో పలువురు నిర్మాతలు.. నటుడు బాలకృష్ణతో బుధవారం భేటీ అయ్యారు. ప్రసాద్ ప్రివ్యూ థియేటర్ వద్ద ఆయన్ను కలిసి తెలుగు చలన చిత్ర పరిశ్రమలో నెలకొన్న తాజా పరిణామాలను వివరించారు. ఈ సమావేశంలోని ముఖ్యాంశాలను నిర్మాత ప్రసన్న కుమార్ మీడియాకు వెల్లడించారు. "నిర్మాత బాగుండాలని బాలకృష్ణ ఎప్పుడూ చెబుతుంటారు. అదే విషయాన్ని మరోసారి గుర్తుచేశారు. వర్కింగ్ డేస్ ఎంత తక్కువ అయితే అంత మంచిదన్నారు. అవసరం మేరకే కార్మికులను తీసుకోవాలని సూచించారు. అటు నిర్మాతలు, ఇటు కార్మికులు.. అందరూ బాగుండేలా తాను చూసుకుంటానన్నారు. థియేటర్ల సమస్యలనూ దృష్టిలో పెట్టుకుని ఏడాదికి నాలుగు సినిమాల్లో నటిస్తానని చెప్పారు. సమస్యల పరిష్కారాలకు తనవంతు కృషి చేస్తానన్నారు" అని తెలిపారు. ఈ పరిణామాలపై పలువురు నిర్మాతలు.. నటుడు చిరంజీవిని మంగళవారం కలిసిన సంగతి తెలిసిందే. ఫిల్మ్ ఫెడరేషన్– ఫిల్మ్ ఛాంబర్ సామరస్యంగా చర్చించుకోవాలని, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే తాను జోక్యం చేసుకుంటానని చెప్పినట్టు నిర్మాత సి. కల్యాణ్ తెలిపిన తెలిపారు.


# చిరంజీవి బర్త్‌డే.. 157 సినిమా ఫస్ట్ లుక్



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు చిరంజీవి కొత్త సినిమాను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇటీవలే 'సంక్రాంతికి వస్తున్నాం'తో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న దర్శకుడు అనిల్ రావిపూడితో తన కొత్త ప్రాజెక్ట్‌ను మొదలుపెట్టాడు. మెగా 157 అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్ రాబోతుండగా.. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది ఈ చిత్రం. అయితే ఈ ప్రాజెక్ట్ నుంచి తాజా అప్‌డేట్ ఒకటి బయటకి వచ్చింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా టైటిల్‌తో ఫస్ట్ లుక్ గ్లింప్స్‌ను ఆగస్టు 22న చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయబోతున్నట్లు సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, చిరంజీవి కుమార్తె సుస్మిత సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తుండగా.. చిరంజీవి ఈ చిత్రంలో తన నిజమైన పేరు శంకర్ వరప్రసాద్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాలో కథానాయికగా తమిళ లేడి సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటించబోతుంది.

# నేను గేమింగ్ యాప్‌నే ప్రమోట్ చేశా

## ఈడీ విచారణకు హాజరైన విజయ్‌దేవరకొండ



**హైదరాబాద్:** తాను గేమింగ్ యాప్‌నే ప్రమోట్ చేశానని, గేమింగ్ యాప్స్‌కు, బెట్టింగ్ యాప్స్‌కు తేడా ఉందన్నారు నటుడు విజయ్ దేవరకొండ. దాదాపు నాలుగున్నర గంటల పాటు ఈడీ విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "బెట్టింగ్ యాప్ కేసులో నా పేరు రావడంతో విచారణకు పిలిచారు. దేశంలో బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్.. ఇలా రెండు రకాలు ఉన్నాయి. నేను గేమింగ్ యాప్‌ని ప్రమోట్ చేశానని క్లారిటీ ఇచ్చా. బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్‌కి సంబంధం లేదు. గేమింగ్ యాప్స్ చాలా రాష్ట్రాల్లో లీగల్. గేమింగ్ యాప్స్‌కి జీఎస్టీ, టాక్స్, అనుమతులు, రిజిస్ట్రేషన్ ఉంటాయి. నా బ్యాంకు లావాదేవీల వివరాలన్నీ ఈడీకి సమర్పించా. నేను ప్రమోట్ చేసిన యాప్ తెలంగాణలో ఓపెన్ కాదు. నేను లీగల్ గేమింగ్ యాప్‌ను మాత్రమే ప్రమోట్ చేశా. సంబంధిత కంపెనీతో నేను చేసుకున్న ఒప్పందం వివరాలూ ఈడీకి వెల్లడించా" అని తెలిపారు.

# వరుస ప్లాప్స్‌తో కనిపించకుండాపోయిన రకుల్




ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా రాణించిన అందాల భామ రకుల్ ప్రీత్ సింగ్. ఈ అమ్మడి గురించి తెలుగు ప్రజలకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.. తన అందంతో, నటనతో తెలుగు ప్రజలను కట్టిపడేసింది ఈ చిన్నది. 18 ఏళ్ల వయసులో కాలేజీలో చదువుతున్నప్పుడే మోడలింగ్‌లో కెరీర్ ప్రారంభించి 2009లో కన్నడ చిత్రం 'గిల్లి'తో తన హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించింది. ఆ తరువాత 2011 కెరటంలో సిద్ధార్థ్ రాజ్‌కుమార్ సరసన నటించింది, ఇది తెలుగు మరియు తమిళ భాషలలో విడుదలైంది. ఆ తరువాత తెలుగులో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాతో భారీ పాపులారిటీ అందుకున్న రకుల్ ప్రీత్ సింగ్, ఆ తర్వాత చాలామంది స్టార్ హీరోల సరసన నటించి మెప్పించింది. ఇదిలా ఉండగా ఇటీవలే తాను ప్రేమించిన ప్రముఖ బాలీవుడ్ నటుడు నిర్మాత అయిన జాకీ భగ్నానీ నీ ప్రేమించి మరీ వివాహం చేసుకుంది. ఒకవైపు సినిమాలలో నటిస్తూనే, మరోవైపు గ్లామర్ వలకబోస్తూ అందాల ఆరబోతతో యువతకు చెమటలు పట్టించే ప్రయత్నం చేస్తోంది. కానీ తెలుగులో సినిమాలు తగ్గించింది ఈ వయ్యారి భామ. తెలుగులో రకుల్ నటించిన లాస్ట్ ఎనిమిది సినిమాలు వరుసగా ఫ్లాప్ అయ్యాయి. దాంతో ఈ చిన్నదానికి ఆఫర్స్ తగ్గాయి. దాంతో ఈ చిన్నది సోషల్ మీడియాలో పోస్ట్ లు చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. అలాగే హిందీలోనూ సినిమాలు చేస్తూ మెప్పిస్తుంది. ఇప్పుడు ఈ బ్యూటీ సినిమాల పరంగా సైలెంట్ అయ్యింది. సినిమాల్లో బిజీగా లేకపోయినా సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటూ అభిమానులను పలకరిస్తుంది రకుల్. ఈ క్రమంలోనే తాజాగా కొన్ని ఫోటోలను వదిలింది ఈ వయ్యారి భామ.



# చీరకట్టులో కవిస్తున్న నిత్యశ్రీ

కంచరపాలెం సినిమాలో చూపించిన సంఘటనల్లో ఒక్కటైనా మన జీవితంలోనూ ఎదురై ఉంటుంది. ఇక కంచరపాలెం సినిమాలోని ప్రతి క్యారెక్టర్ ప్రేక్షకులకు బాగా దగ్గరయింది. అలాగే ఈ సినిమాలో నటించిన చైల్డ్ ఆర్టిస్ట్‌లు గుర్తున్నారా..? చక్కటి నటనతో ఆకట్టుకున్నారు అందరూ. పై ఫొటోలో కనిపిస్తున్న చిన్నది కూడా తన నటనతో ప్రేక్షకులను మెప్పించింది. తన క్యూట్ క్యూట్ నటనతో ముద్దు ముద్దు మాటలతో ఆకట్టుకుంది ఆ చిన్నది. పై ఫొటోలకనిపిస్తున్న చిన్నారి పేరు నిత్యా శ్రీ.. కంచెరపాలెం సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది నిత్యా. ఈ సినిమా తర్వాత పలు సినిమాల్లో నటించింది. ఇక ఇప్పుడు సోషల్ మీడియాలో సందడి చేస్తోంది నిత్యా. మొన్నమధ్య ధనుష్ నటించిన సార్ సినిమాలో కనిపించింది. ఈ చిన్నారి ఇప్పుడు ఎలా ఉందో తెలుసా..? ఈ అమ్మడు చాలా అందంగా మారింది. హీరోయిన్స్ కు ఏమాత్రం తీసిపోని అందంతో ఆకట్టుకుంటుంది నిత్యా. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉండే ఈ అమ్మడు. రీల్స్ చేస్తూ ఆకట్టుకుంటుంది. పలు షార్ట్ ఫిలిమ్స్ లోనూ నటిస్తుంది ఈ చిన్నారి. అలాగే క్రేజీ ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఇటీవలే ఓ సినిమాలో హీరోయిన్ గా ఎంపికైందని తెలుస్తుంది. తాజాగా ఈ చిన్నదాని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఈ ఫోటోల పై మీరూ ఓ లుక్కేయండి. తాజాగా నిత్యా చీరకట్టులో కొన్ని ఫోటోలు వదిలింది. ఈ ఫోటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. చీరకట్టులో వయ్యారాలు ఒలకబోస్తూ క్యూట్ పోజులు ఇచ్చింది. ఈ ఫోటోల పై కుర్రకారు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.



# పుష్ప-2 తొక్కిసలాటపై ఎన్‌హెచ్ఆర్సీ సీరియస్


ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' సినిమా ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయ్యింది. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మానవ హక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ తొక్కిసలాటలో ఒక మహిళ మరణించగా, ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయంపై అందిన ఫిర్యాదును పరిశీలించిన జాతీయ మానవ హక్కుల కమిషన్, సినిమా థియేటర్ వద్ద తగిన భద్రతా చర్యలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను సీరియస్‌గా పరిగణిస్తూ, మృతురాలి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందించాలని అలాగే ఈ సంఘటనపై పూర్తి నివేదికను సమర్పించాలని తెలంగాణ పోలీసులను ఆదేశించింది. కాగా.. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు వెలువడాల్సి ఉంది.

# అంచనాలు పెంచుతున్న మంచు మనోజ్ సినిమా టైటిల్



టాలీవుడ్ రాకింగ్ స్టార్ మంచు మనోజ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి నేటికి ఆయనకి 21 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సుదీర్ఘ ప్రయాణంలో మంచి విజయాలతో పాటు ఎన్నో ఒడిదుడుకులను కూడా ఎదుర్కొన్నారు. చాలా కాలంగా సినిమాలకి దూరంగా ఉన్న మనోజ్ ఇటీవల భైరవం అనే చిత్రంతో పలకరించాడు. మల్టీ స్టారర్ చిత్రంగా ఈ మూవీ అలరించింది. ఇక ఇప్పుడు మళ్లీ ఒక పవర్‌ఫుల్ సినిమాతో రెడీ అయ్యారు. తాజాగా "డేవిడ్ రెడ్డి" అనే టైటిల్‌తో మనోజ్ 21వ సినిమాను అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని దర్శకుడు హనుమ రెడ్డి యక్కంటి డైరెక్ట్ చేయగా, వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. విడుదలైన టైటిల్ పోస్టర్, మేకర్స్ విడుదల చేసిన సమాచారం ఈ ప్రాజెక్టుపై భారీగా ఆసక్తిని పెంచాయి. ఈ సినిమా కథ 1897 నుంచి 1922 మధ్యకాలాన్ని ఆధారంగా చేసుకుని రూపొందుతుంది. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదుర్కొంటూ, కుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ధైర్యవంతుడి కథగా ఇది తెరకెక్కుతోంది. మనోజ్ ఈ సినిమాలో ఇప్పటివరకు కనిపించని లుక్‌లో, ఒక విప్లవవాది పాత్రలో కనిపించనున్నారు. "మద్రాస్ ప్రెసిడెన్సీలో జన్మించాడు. ఢిల్లీలో పెరిగాడు. ఇప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కదిలించాడు అనే స్టేట్మెంట్‌తో రివీల్ చేసిన టైటిల్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఇటీవల భైరవం సినిమాలో తన యాక్టింగ్ స్కిల్స్‌తో ప్రశంసలు అందుకున్న మనోజ్, ఇప్పుడు మిరాయ్ అనే చిత్రంలో విలన్‌గా నటిస్తున్నారు. అలాగే "డేవిడ్ రెడ్డి"లో మరింత పవర్‌ఫుల్‌గా కనిపించబోతున్నారు. సినిమా కేవలం యాక్షన్ డ్రామా కాదు, ఒక చారిత్రక నేపథ్యంతో కూడిన భావోద్వేగాలు, తాత్వికత కలగలిసిన హై ఓక్టేన్ డ్రామాగా రూపొందుతోందని తెలుస్తోంది.టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో మనోజ్ 21 సంవత్సరాల జర్నీని బ్యాంగ్‌తో సెలబ్రేట్ చేస్తున్నారు. ఈసారి, ఒక నిర్భయ తిరుగుబాటు దారుడిగా వస్తున్నారు. మరి ఈ సినిమా మనోజ్‌కి కంబ్యాక్ హిట్ ఇస్తుందా? అసలు "డేవిడ్ రెడ్డి" అనే పాత్రలో మనోజ్ ఎలా కనిపిస్తారు? అనేది తెలుసుకోవాలంటే కొద్ది రోజులు వేచి చూడక తప్పదు.

# జూనియర్ ఎన్టీఆర్ సినిమాకు భారీగా ధరలు



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న వార్ 2 చిత్రం. ఈ సినిమా హిందీలో సాధారణ ధరలతో విడుదల కాబోతుండగా, డబ్బింగ్ వెర్షన్ తెలుగులో మాత్రం టికెట్ ధరలను నిర్మాతలు పెంచబోతున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రతి స్టార్ సినిమాకు పెరుగుతున్న టికెట్ ధరలతో పాటు, డబ్బింగ్ సినిమాలకు కూడా టికెట్ రేట్లు పెంచడం ప్రస్తుతం నెటిజన్ల ఆగ్రహానికి కారణమవుతోంది. ఎన్టీఆర్ నటిస్తున్న వార్ 2 సినిమాతో పాటు రజనీకాంత్ నటిస్తున్న కూలీ చిత్రాలు సొంత భాషల్లో సాధారణ టికెట్ ధరల్లోనే ప్రేక్షకులకు అందుబాటులోకి రాబోతుండగా.., తెలుగులో ఈ సినిమాలకు టికెట్ ధరలను పెంచబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇవే కాకుండా ఇంతకుముందు వచ్చిన చాలా తెలుగు సినిమాలకు కూడా టికెట్ ధరలను పెంచి జనాన్ని థియేటర్లకు రాకుండా చేస్తున్నారు నిర్మాతలు. దీంతో సోషల్ మీడియాలో ఈ అంశంపై తీవ్రమైన ట్రోలింగ్ జరుగుతోంది. గతంలో ఒక సినిమా టికెట్ ధర గరిష్టంగా రూ.150 నుండి రూ.200 వరకు ఉండేది. కానీ ఇప్పుడు కొత్తగా విడుదలయ్యే ప్రతి స్టార్ సినిమాకు టికెట్ ధరలు రూ.300 నుండి రూ.400 వరకు చేరుకున్నాయి. కొన్ని మల్టీప్లెక్స్‌లలో అయితే మొదటి వారం టికెట్ ధరలు రూ.500 వరకు కూడా పెంచుతున్నారు. ఈ ధరలు సామాన్య ప్రేక్షకుడికి చాలా భారంగా మారాయి. దీంతో కుటుంబంతో కలిసి సినిమా చూడాలంటే దాదాపు రూ.2 వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తుంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com